మద్యం దరఖాస్తుకు అమావాస్య అడ్డంకి



కర్నూలు నేరవి భాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాల అనుమతుల దరఖాస్తు ప్రక్రియ ఇంకా పుంజుకోలేదు. కర్నూలు జిల్లాలో 99 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ విధానంలో దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించారు. ఈనెల 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. అనివార్య కారణాలతో మొదటి రోజు దరఖాస్తు చేసుకోలేదని తెలిసింది. రెండో రోజైన బుధవారం అమావాస్య కావడంతో స్పందన లేదు. అమావాస్య నేపథ్యంలో చాలామంది దరఖాస్తు చేసేందుకు ముందుకు రాలేదని అధికారులు చెబుతున్నారు. కోసిగి స్టేషన్ పరిధిలో మాత్రం ఒక్కరు స్వయంగా స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. మూడో రోజు నుంచి మంచి స్పందన వచ్చే అవకాశముందని ఆబ్కారీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎక్కడ ఎంత వ్యాపారం జరగొచ్చు

మద్యం దుకాణ అనుమతికి దరఖాస్తు రుసుము రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. పోతే రూ.2 లక్షలు, అదృష్టం కలిసొస్తే మద్యం దుకాణం దక్కనున్నట్లుగా మారింది. దరఖాస్తు రుసుము పెద్ద మొత్తం కావడంతో దరఖాస్తుదారులు అన్నివిధాలుగా ఆలోచిస్తున్నారు. కర్నూలు నగరంలో ముగ్గురు, నలుగురు కలిసి భాగస్వామ్య ఒప్పందంతో దరఖాస్తు చేసుకుంటున్నట్లు సమాచారం. నాయకులు, వ్యాపారులు, యువకులు సైతం అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మద్యం అమ్మకాలు ఎక్కడ ఎక్కువగా జరుగుతాయో సదరు దుకాణ అనుమతికి దరఖాస్తు చేసుకునే ఆలోచనలో ఉన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వివరాలు తెలుసుకుంటున్నారు. రోజువారీ వ్యాపారం, లాభాలు అంచనా వేసుకుంటున్నారు. ముఖ్య కూడళ్లలోని దుకాణాల్లో అమ్మకాలు నిత్యం రూ.లక్షల్లో ఉండటంతో వాటిపైనే అధిక శాతం మంది దృష్టి సారిస్తున్నారు.

జాతిపిత.. స్ఫూర్తిప్రదాత : మంత్రి భరత్

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: అహింసే ఆయుధంగా స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు గాంధీ అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కర్నూలులో ఆయన విగ్రహానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి బుధవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాంటిస్సోరి పాఠశాల విద్యార్థిని గాంధీ వేషధారణతో అలరించాడు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య, ఇన్‌ఛార్జి డీఆర్వో చిరంజీవి, జిల్లా పరిషత్తు సీఈవో నాసరరెడ్డి, సీఈవో హిమప్రభాకర్‌రాజు, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళి అర్పించిన మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కలెక్టర్ రంజిత్ బాషా తదితరులు

పదవి లేకున్నా.. పైరవీల్లో మిన్న

■ బుగ్గనను నమ్ముకున్న వారికి కీలక స్థానాలు

■ ఇష్టానుసారంగా పోస్టింగులు ఇప్పించుకున్న వైనం ■ అధికార వర్గాల్లో విస్మయం



వైకాపా ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించిన నాటి మంత్రి బుగ్గన ఇప్పుడు సైతం చక్రం తిప్పుతున్నారన్న ప్రచారం ఉంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ తనను నమ్ముకున్న వారికి కీలక పోస్టింగులు ఇప్పించుకోగలిగారన్న ప్రచారం జరుగుతోంది. ఇటీవల జరిగిన బదిలీల సరళిని పరిశీలిస్తే గతంలో ఆయన నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వర్తించిన వారికి కీలక పోస్టులు దక్కడం గమనార్హం. ఆయనకు వ్యక్తిగత సహాయ కార్యదర్శిగా ఐదేళ్లపాటు విధులు నిర్వర్తించిన ప్రతాప్‌రెడ్డి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో డీఆర్‌డీఏ పీడీగా పోస్టింగు పొందారు. ఇలానే పలువురు తమకు కావాల్సిన స్థానాలు దక్కించుకున్నారు.

ఈనాడు, కర్నూలు :

ఎలా సాధించుకున్నారో..


మాజీ మంత్రి బుగ్గన నియోజకవర్గ పరిధిలోని డోన్, బేతంచెర్ల మండలాల్లో కలిపి సుమారు ఐదేళ్లపాటు తహసీల్దారుగా పనిచేసిన నరేంద్రనాథ్‌రెడ్డి సైతం బుగ్గనకు ఆత్మీయుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన ఆశీస్సులతోనే నియోజకవర్గంలోని రెండు మండలాల్లో పూర్తికాలం పాటు విధులు నిర్వర్తించారన్న ప్రచారం ఉంది. బుగ్గన చెప్పింది చెప్పినట్లు చేయడంతో ఆయనకు సన్నిహితుడిగానూ పేరు తెచ్చుకున్నారన్న ప్రచారం ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో కీలకమైన పాణ్యం తహసీల్దారు పోస్టును ఆయన దక్కించుకున్నారు. బుగ్గనకు అత్యంత సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్న సదరు అధికారి ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో కీలకమైన పాణ్యం నియోజకవర్గంలో తహసీల్దారు పోస్టు ఎలా సాధించారన్నది మిస్టరీగా మారింది.

అక్రమాలు వెలికితీసేలా..

డోన్, బేతంచెర్ల తహసీల్దారు కార్యాలయాల కేంద్రంగా పలు అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు ప్రస్తుత ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో వీటిపై రహస్య విచారణ చేయాల్సిందిగా ఎమ్మెల్యే ఆదేశించారన్న విషయం ప్రస్తుతం కలకలంగా మారింది. ఆ రెండు మండలాల పరిధిలో పెద్దఎత్తున అక్రమ లేఅవుట్లు వెలిశాయని, కొందరు ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకున్నారని, అసైన్డ్ భూముల్లో సంబంధం లేని వ్యక్తులు భారీ నిర్మాణాలు చేసి వ్యాపారాలు చేస్తున్నారని, ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎస్పీ కార్యాలయంలోనే నియామకం

ప్రస్తుతం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచి విభాగంలో ఎస్.బి.-2 సీఐగా పోస్టింగు పొందిన కేశవరెడ్డి.. బుగ్గన స్వగ్రామమైన బేతంచెర్లలో గతంలో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బేతంచెర్లలో ఎస్సైగా, సీఐగా ఐదేళ్లకు పైగా పనిచేయడంతో బుగ్గనకు కావాల్సిన అధికారిగా మారారు. బుగ్గన సూచన మేరకే విజిలెన్స్ విభాగంలోనూ సీఐగా విధులు నిర్వర్తించారన్న ప్రచారం జరుగుతోంది. గత ఐదేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లాలో పోలీసులకు సంబంధించిన అన్నిరకాలైన నిర్ణయాల్లో ఆయన తెరవెనుక పాత్ర పోషించినట్లు సమాచారం. ఆయన సిఫార్సులతో పలువురు పోలీసు అధికారులు తమకు నచ్చినచోట్ల పోస్టింగులు పొందినట్లు తెలుస్తోంది. అలాంటి వ్యక్తికి సాక్షాత్తూ జిల్లా ఎస్పీ కార్యాలయంలోనే పోస్టింగు లభించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పలుకుబడి ఉపయోగించి..

ప్రస్తుతం ఓర్వకల్లు తహసీల్దారుగా కీలకమైన పోస్టులో నియమితులైన విద్యాసాగర్ గత వైకాపా ప్రభుత్వ హయాంలో తొలి రెండున్నరేళ్లపాటు బేతంచెర్ల లోనూ, ఆ తర్వాత సుమారు రెండున్నరేళ్లపాటు డోన్ తహసీల్దారుగా కొనసాగారు. ఆ రెండు మండలాలు సైతం మాజీ మంత్రి బుగ్గన ప్రాతినిధ్యం వహించిన డోన్ నియోజకవర్గంలోనివే. బుగ్గన ఆశీస్సులు సమృద్ధిగా ఉండడంతో ఆయన నియోజకవర్గంలోనే పూర్తిస్థాయిలో సేవలు అందించగలిగినట్లు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి తెదేపా హయాంలో ఆయనకు గడివేముల మండల తహసీల్దారుగా పోస్టింగు లభించింది. కర్నూలుకు 60 కి.మీ.ల దూరంలో ఉన్న గడివేములలో విధులు నిర్వర్తించడం ఆయనకు ఇష్టంలేదు. ఈ నేపథ్యంలో తనకున్న పలుకుబడిని ఉపయోగించి కేవలం నెల రోజుల వ్యవధిలోనే కర్నూలు ఆనుకుని ఉన్న కీలక మండలమైన ఓర్వకల్లు తహసీల్దారుగా పోస్టింగు దక్కించుకున్నారు. బుగ్గనకు అత్యంత సన్నిహితంగా మెలిగినప్పటికీ గత వైకాపా ప్రభుత్వంలో కంటే మరింత మెరుగైన పోస్టింగును పట్టుబట్టి మరీ దక్కించుకోగలిగారు.

దస్త్రాలు మాయం

డోన్, బేతంచెర్ల మండలాల పరిధిలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు సంబంధించిన దస్త్రాలు సైతం మార్చేశారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమాలు బయటపడతాయన్న ఉద్దేశంతో తహసీల్దారు కార్యాలయంలో కొన్ని దస్త్రాలు మాయం చేశారన్న ప్రచారం జరుగుతోంది. డోన్ నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో అక్రమ లేఅవుట్లు వెలిసినట్లు కూడా అధికారులు సైతం గుర్తించారు. ఏఏ సర్వే నంబర్లలో.. ఎంత విస్తీర్ణంలో లేఅవుట్లు వేశారన్న వివరాలను వారు అధికారికంగానూ ప్రకటించారు. రాజకీయ నాయకుల అండదండలతో అక్రమంగా లేఅవుట్లు వేసిన వారు అందులోని స్థలాలను విక్రయించి భారీగా ఆదాయం ఆర్జించారు.


సిరిధాన్యం.. సాగు దైన్యం

• డిమాండ్ పెరిగినా ఉత్పత్తులు అంతంతే



ప్రజల జీవనశైలిలో ఎన్నో మార్పులొచ్చాయి. ఆహారపు అలవాట్లు మారిపోయాయి. సిరిధాన్యాల వాడకం క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వం సైతం ప్రోత్సహిస్తోంది. అయినా ఉమ్మడి జిల్లాలో చిరుధాన్యాల సాగు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. గతంతో పోలిస్తే కొర్రలు ఒక్కటే కొంతమేర సాగు పెరగ్గా.. మిగిలినవి అంతంతమాత్రమే. 2020 సంవత్సరంలో 8.82 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. గతేడాది 9.10 లక్షల హెక్టార్లకు పెరిగింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 4.89 లక్షల హెక్టార్లలో అన్నిరకాల పంటలు సాగయ్యాయి. చిరుధాన్యాల పరంగా పరిశీలిస్తే సాగు అంతంతమాత్రమే.

– న్యూస్‌టుడే, కర్నూలు వ్యవసాయం



జనం ఆసక్తి చూపుతున్నా..

జొన్న అంబలి, రాగి జావ, ఉలవ చారు, కొర్రల దోశ, సామల ఉప్మా.. ఇలా చిరుధాన్యాల ఆహారంపై జనంలో ఆసక్తి పెరుగుతోంది. విపణిలో వీటికి మంచి డిమాండ్ ఉంది. పదేళ్ల కిందట చిరుధాన్యాల వినియోగం 10 శాతం వరకు ఉండగా.. ప్రస్తుతం 30-40 శాతానికి పైగా పెరిగింది. ఉమ్మడి జిల్లాలో సాగు మాత్రం పెరగడం లేదు. చాలామంది రైతులు వరి, పత్తి, మిరప తదితర వాణిజ్య పంటల సాగుకే మొగ్గు చూపుతున్నారు. మారుతున్న జీవనశైలి నేపథ్యంలో చిరుధాన్యాల ప్రాధాన్యం పెరుగుతున్నా స్థానికంగా పంటలు లేక ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

కాగితాల్లో ఘనం..

2023 సంవత్సరాన్ని కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. 2022 ఖరీఫ్‌లో 7,012 ఎకరాల్లో చిరు ధాన్యాల పంటలు సాగయ్యాయి. 2023 ఖరీఫ్‌లో 21,825 ఎకరాలకు పెరిగినట్లు అధికారులు చెబుతున్నా అదంతా కాగితాలకే పరిమితమైంది. క్షేత్రస్థాయిలో పంటల ఊసే లేదు. చిరు ధాన్యాలకు ధర లేనప్పుడు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయిస్తోంది. రాయితీపై విత్తనాలు అందిస్తోంది. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ శాఖ మాత్రం సాగు పెరిగేలా చర్యలు తీసుకోవడం లేదు.

విస్తీర్ణం తగ్గుతోంది..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2014-15 సంవత్సరంలో 10,11,205 హెక్టార్ల సాగు భూమి ఉండేది. 2019-20లో 9.37 లక్షల హెక్టార్లు, 2020-21లో 8.82 లక్షల హెక్టార్లు, 2021-22 సంవత్సరానికి 8,77,304 హెక్టార్లకు పడిపోయింది. 2022-23లో 9.25 లక్షల హెక్టార్లు, 2023-24లో 9,10,432 హెక్టార్లలో సాగు ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 4.89 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. 2014-15 నుంచి 23-24 వరకు పరిశీలిస్తే లక్ష హెక్టార్లలో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.

● 2020 నుంచి 2024 ఖరీఫ్ వరకు ఉమ్మడి జిల్లాలో అండు కొర్రలు, ఊదలు, వరిగలు, సామలు, అరికలు ఒక్క ఎకరా కూడా సాగవలేదు.

విధిగా లక్ష్యం విధిస్తేనే..

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొర్రలు సాధారణ సాగు 10 వేల హెక్టార్లు ఉండగా.. ప్రస్తుతం ఆరు వేల హెక్టార్లకుపైగా సాగవుతోంది. అందు కొర్రలు, ఊదలు, అరికలు, రాగుల కొనుగోళ్లు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. రోజుకు దాదాపు 850-1000 కిలోల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ఇక్కడ పంటలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు తెప్పించి కిలో రూ.200-300 వరకు విక్రయిస్తున్నారు. నెలకు 300 క్వింటాళ్లు, ఏడాదికి 3,600 క్వింటాళ్ల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ఏటా చిరుధాన్యాల వ్యాపారమే రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్లు దాటుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో వ్యవసాయ వార్షిక ప్రణాళికలో విధిగా గ్రామాలవారీగా చిరుధాన్యాల సాగు లక్ష్యం నిర్ణయించాల్సి ఉంది.

పింఛన్ల పంపిణీలో మొదటిస్థానం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా హ్యాట్రిక్ సాధించింది. పింఛన్ల పంపిణీలో వరుసగా మూడు నెలలు కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అక్టోబరులో పింఛన్ల పంపిణీలో 99.13 శాతంతో కర్నూలు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం విశేషం. జిల్లాలో మొత్తం 2,41,843 పింఛన్లు ఉండగా.. అందులో 2,39,742 పింఛన్లను పంపిణీ చేశారు.

చిరుత కలకలం

పెద్దకడబూరు న్యూస్‌టుడే : మండలంలోని హనుమాపురం గ్రామంలో చిరుత సంచరించడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి చిరుత గ్రామంలోకి చొరబడి మూడు గేదె దూడలను చంపేసిందని గ్రామస్థులు తెలిపారు. అటవీశాఖ అధికారులు దృష్టి సారించి చిరుతను బంధించాలని విన్నవిస్తున్నారు.

టెట్‌కు వేళాయె

• నేటి నుంచి నిర్వహణ



కర్నూలు విద్య, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిర్లక్ష్యం చేసింది. ఎన్నికల ముందు డీఎస్సీ పేరుతో హడావుడి చేసింది. అంతలో ఎన్నికల ప్రకటన రావడంతో ఇది మూలనపడింది. మరోవైపు తాము అధికారంలోకి రాగానే డీఎస్సీ నిర్వహణకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా తొలుత టెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కర్నూలు జిల్లావ్యాప్తంగా 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష జరగనుంది. కర్నూలు నగరంలో నాలుగు, ఆదోని, ఎమ్మిగనూరులో ఒక్కో కేంద్రం.. హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు సిద్ధం చేశారు. మొదటి సెషన్‌లో భాగంగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌లో భాగంగా 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్షా కేంద్రానికి రెండు గంటల ముందే అభ్యర్థులు చేరుకోవాలని డీఈవో శామ్యూల్ బుధవారం తెలిపారు. మరోవైపు ఆర్టీసీ, పోలీసు, వైద్యం, విద్యుత్తు తదితర శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

54,083 మంది అభ్యర్థులు

- ఆదోనిలోని బీమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో 3,100 మంది అభ్యర్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు. నగర శివారులోని బిట్స్ కళాశాలలో 1,668, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 7,317, కర్నూలు నగర శివారు సనత్ నగర్‌లోని అయాన్ డిజిటల్ కేంద్రంలో 20,265, దూపాడు వద్దనున్న అయాన్ డిజిటల్ కేంద్రంలో 7,410, ఎమ్మిగనూరులోని సెయింట్ జోసెఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో 900 మంది అభ్యర్థులు టెట్‌కు హాజరుకానున్నారు.
- హైదరాబాద్‌లోని రెండు పరీక్షా కేంద్రాల్లో 13,423 మంది పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నారు.
- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకుని కేంద్రాలకు రావాల్సి ఉంటుంది.

అందుబాటులో హెల్ప్‌లైన్ నంబర్లు

టెట్ కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలుంటే కర్నూలు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన టెట్ హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 81218 21266, 63000 46199, 91776 89177 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని డీఈవో శామ్యూల్ పేర్కొన్నారు.



శరన్నవరాత్రులకు సన్నద్ధం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు భ్రమరాంబాదేవికి ఈవో డి.పెద్దిరాజు దంపతులు, అర్చకులు, వేద పండితులు పసుపు, కుంకుమ, ఫలాలు సమర్పిస్తారు. అనంతరం ఆశీర్వచన మండపంలో గణపతిపూజ, పుణ్యాహావాచనం, కంకణపూజ తదితరాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రాత్రి 7 గంటలకు శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

ఉత్తర్వు 117 రద్దు చేయాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉత్తర్వు 117ను వెంటనే రద్దు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ డిమాండు చేశారు. నగరంలోని జడ్పీ వద్దనున్న గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పాత పింఛను విధానం కొనసాగించాలని చెప్పారు. మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు వెంకటరాముడు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

నీరోలు.. న్యూరోను పట్టించుకోరు

● పెద్దాస్పత్రిలోని విభాగంలో పనిచేయని ఏసీలు

● శస్త్రచికిత్సలకు అంతరాయం

పేరుకే కర్నూలు సర్వజన ఆస్పత్రి. వసతులు మాత్రం అధ్వానం. రోగుల సంఖ్యకు తగ్గట్టు సౌకర్యాలు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఏసీలు పనిచేయక శస్త్రచికిత్సలకు ఆటంకం కలుగుతోంది. అయినప్పటికీ ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా రోగులు.. వారి సహాయకులు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు.

- న్యూస్‌టుడే, కర్నూలు వైద్యాలయం

కర్నూలు వైద్యశాలకు చికిత్స నిమిత్తం ప్రతిరోజూ 3 వేల మంది రోగులు వస్తుంటారు. ఆస్పత్రిలోని పలు విభాగాల్లో సమస్యలు నెలకొన్నాయి. ముఖ్యంగా న్యూరోసర్జరీలో వసతులలేమి వేధిస్తోంది. ఈ విభాగానికి నెలకు 1,700 నుంచి 2 వేల వరకు ఓపీ, 300 వరకు ఐపీ ఉంటుంది. దీంతోపాటు ప్రతిరోజూ జరిగే ప్రమాదాల్లో గాయపడిన బాధితులు, తలకు దెబ్బ తగిలినవారు, నరాలకు సంబంధించిన సమస్యలతో బాధపడే వారు తదితరులు చేరుతూ ఉంటారు. వీరిలో అత్యవసరంగా ప్రతి నెలా 60 నుంచి 70 మందికి వైద్యులు శస్త్రచికిత్సలు చేస్తుంటారు.



వార్డులో సరిగా లేని ఫ్లోరింగ్ | ఐసీయూలో పనిచేయని వెంటిలేటర్

మూడు నెలలుగా వేధిస్తున్నా..

న్యూరోసర్జరీ విభాగంలో మాడ్యులర్ ఓటీని 2017లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఏడాది జూన్ నుంచి సెంట్రల్ ఏసీ మరమ్మతులకు గురైంది. మూడు నెలలుగా సమస్య వేధిస్తున్నా పట్టించుకున్నవారే కరవయ్యారు. వార్డులో ఫ్లోరింగ్ దెబ్బతింది. ఐసీయూలో వెంటిలేటర్లు సరిగా పనిచేయడం లేదు. ఫలితంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఓటీలో ఏసీలు పనిచేయకపోవడం.. ఫ్యాన్ల మధ్య ఆపరేషన్లు చేయాలంటే వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర ఉక్కపోతతో శస్త్రచికిత్సలు చేయలేని పరిస్థితి. సమస్యను ఆస్పత్రి పర్యవేక్షకుడి దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదు.

పాత మంచాలతో ఇబ్బందులు

న్యూరోసర్జరీ విభాగంలో సుమారు 63 పడకలు ఉన్నాయి. గతేడాది వార్డులో ఫ్లోరింగ్ దెబ్బతింది. దీంతో రోగులను బెడ్ల వద్దకు స్ట్రెచర్లలో తీసుకెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శస్త్రచికిత్సలు చేసినవారికి.. ముఖ్యంగా తలకు ఆపరేషన్ చేసినవారికి హైడ్రాలిక్ పడకలు అందుబాటులో ఉండాలి. తల ఎత్తులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వార్డులో ఈ పడకలు లేవు. పాత మంచాలే అందుబాటులో ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

న్యూరోలో గత మూడు నెలల్లో జరిగిన శస్త్రచికిత్సల వివరాలు

నెల	ఐపీ	శస్త్రచికిత్సలు
జూన్	322	70
జులై	276	60
ఆగస్టు	252	65

వెంటిలేటరు పనిచేయక..

అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో సర్జికల్‌కు సంబంధించి ఐసీయూకు ప్రత్యేకంగా 6 పడకలు ఉన్నాయి. న్యూరోసర్జరీ, యూరాలజీ తదితర విభాగాలకు సంబంధించిన బాధితులకు ఈ విభాగంలో అత్యవసర వైద్యం అందిస్తారు. ఈ యూనిట్‌లోని నాలుగో నంబరు బెడ్‌కు సంబంధించిన వెంటిలేటరు పనిచేయక ఏడాదైంది. దీనికితోడు ఆక్సిజన్ సరఫరా కావడం లేదు. మిగతా పడకలకు సంబంధించి సైతం ప్రాణవాయువు సరిగా అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నవదుర్గా నమోస్తుతే

- శ్రీగిరిలో నేటి నుంచి దసరా ఉత్సవాలు
- భ్రమరాంబాదేవికి రోజుకో అలంకరణ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ఇల కైలాసం శ్రీశైలంలో గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఉత్సవాల్లో భ్రమరాంబాదేవి నవదుర్గల రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఒక్కో రూపంలోని దర్శించుకున్న, పూజించడం వల్ల కష్టాలు తొలగిపోయి, సుఖసంతోషాలు ప్రాప్తిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఎక్కడా లేని విధంగా శ్రీశైలంలో మార్కండేయ పురాణాన్ని అనుసరించి నవదుర్గల అలంకారం, పూజలు, గ్రామోత్సవం నిర్వహించడం విశేషం.

తేజోమయం.. శైలపుత్రి రూపం



నవరాత్రుల్లో మొదటి రోజు అమ్మవారు శైలపుత్రిగా దర్శనమిస్తారు. శైలపుత్రి అమ్మవారు సిగలో చంద్రవంకను ఆభరణంగా ధరించి తేజోమయ రూపంలో దర్శనమిస్తారు. కుడి చేత శూలం, ఎడమ చేత పద్మాన్ని ధరించి వృషభ వాహనంపై అమ్మవారు దర్శనమిస్తారు.

బ్రహ్మచారిణి అలంకారం



శరన్నవరాత్రుల్లో అమ్మవారి రెండో స్వరూపం బ్రహ్మచారిణి. కుడి చేత జపమాల, ఎడమ చేత కమండలాన్ని ధరించి ఉంటారు. బ్రహ్మచారిణి పూర్వ జన్మలో హిమవంతుని ఇంట పార్వతిగా అవతరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. నారద మహర్షి ఉపదేశంతో పరమశివుని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేపడతారు. బ్రహ్మచారిణిని ఆరాధించడం వల్ల త్యాగ, వైరాగ్య భావనలు పెంపొందుతాయని దేవీ భాగవతం చెబుతోంది.

చంద్రఘంట.. సుగుణాల మూట



నవదుర్గల్లో మూడో స్వరూపం చంద్రఘంటాదేవి. ఈమె పది చేతులు కలిగుంటారు. కుడి వైపున పద్మం, బాణం, ధనస్సు, అభయహస్తం, జపమాల, ఎడమ వైపున త్రిశూలం, గద, ఖడ్గం, పంచముద్ర, కమండలాన్ని ధరించి ఉంటారు. చంద్రఘంటాదేవి మస్తకంపై ఘంటాకారంలో అర్ధ చంద్రుడు అలరారుతుంటాడు. ఈ అమ్మవారు భక్తుల కష్టాలను త్వరగా తీరుస్తారని ప్రతీతి. ఈ దేవిని ఆరాధించడం వల్ల సౌమ్యం, వినమ్రత, సద్గతి వంటి సుగుణాలు ప్రాప్తించడమే కాకుండా నిర్భయులుగా ఉంటారు.

ఆదిశక్తి.. కూష్మాండ దుర్గ



పరాశక్తి నవదుర్గ రూపాల్లో నాలుగో స్వరూపం కూష్మాండదుర్గ. ఈ దేవి ఎనిమిది భుజాలను కలిగుండటం వల్ల అష్టభుజాదేవిగా కీర్తించబడుతోంది. కూష్మాండ దుర్గ తన ఎనిమిది చేతుల్లో కుడి వైపున పద్మం, బాణం, ధనస్సు, కమండలాన్ని, ఎడమ వైపున చక్రం, గద, జపమాల, అమృత కలశాన్ని ధరించి ఉంటుంది. కూష్మాండ దుర్గ తన చిరునవ్వుతో చరాచర జగత్తును సృష్టించిందని పురాణాలు చెబుతాయి. సృష్టి లేని సమయంలో బ్రహ్మాండాన్ని సృష్టించినందు వల్ల ఈ దేవిని ఆదిశక్తిగా కీర్తిస్తారు. అమ్మవారికి కూష్మాండ (గుమ్మడికాయ) బలి ప్రీతికరమైనది కావడం వల్ల కూష్మాండదుర్గగా ప్రసిద్ధి చెందింది.

కాళరాత్రి.. దుష్ట సంహారిణి




అమ్మవారి ఏడో స్వరూపం కాళరాత్రి. ఈ దేవి నల్లని దేహచాయతో జుట్టు విరబోసుకొని పెద్ద బొట్టు నవ్వులతో చూడ్డానికి భయంకరంగా ఉన్నప్పటికీ భక్తులకు శుభ ఫలితాలు ఇస్తుందని శాస్త్ర వచనం. ఈమె చతుర్భుజాలను కలిగుంటారు. కుడి వైపున అభయహస్తం, వరదముద్రను, ఎడమ వైపున ఖడ్గం, లోహకంటకాన్ని ధరించి ఉంటారు. కాళరాత్రి దేవి దుష్టులను నాశనం చేస్తుంది. కాళరాత్రి దేవిని స్మరించినంతనే భూత, ప్రేత, పిశాచాలు భయపడి పారిపోతాయి.

ఇష్టకామ్యాలు నెరవేర్చే స్కందమాత



ఐదో స్వరూపం స్కందమాత. ఈ దేవి చతుర్భుజాలను కలిగుంటారు. ఈమె ఒడిలో బాలుని రూపంలో షణ్ముఖుడైన కుమారస్వామి కూర్చొని ఉంటారు. స్కందమాత చతుర్భుజాల్లో పై రెండు చేతుల్లో పద్మాలు, కుడి వైపు కింది చేత్తో ఒడిలోని కుమారస్వామిని పట్టుకొని ఉండగా, ఎడమ వైపు కింది చేయి అభయహస్తంగా ఉంటుంది. స్కందుడైన (కుమారస్వామి) తల్లి కావడం వల్ల ఈమె స్కందమాతగా ప్రసిద్ధి చెందారు. ఈ దేవిని ఆరాధించడం వల్ల ఇష్టకామ్యాలు నెరవేరుతాయని దేవీ భాగవతం చెబుతోంది.

కాత్యాయని.. ఆరోగ్య ప్రదాయిని



నవదుర్గల్లో ఆరో స్వరూపం కాత్యాయని అలంకారం. ఈ దేవిని శివశక్తి స్వరూపంగా పూజిస్తారు. కాత్యాయని దేవి చతుర్భుజాలను కలిగుంటారు. కుడి వైపున అభయ హస్తం, వరదముద్రలతోనూ, ఎడమ వైపు పద్మం, ఖడ్గాన్ని ధరించి ఉంటారు. ఈ దేవిని ఆరాధించడం వల్ల రోగ, శోక, భయాలను పోగొడుతుందని భక్తుల విశ్వాసం.

నవరాత్రుల్లో నివేదనలు

శ్రీశైల మహాక్షేత్రంలో నవదుర్గలుగా దర్శనమిచ్చే అమ్మవారికి ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు దద్దోజనం (పెరుగన్నం), 11.30కు కదంబం ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. రాత్రి 9 గంటలకు రాజులో గంగ మహానివేదన చేస్తారు. ఉత్సవమూర్తికి తొమ్మిది రకాల ప్రసాదాలను నివేదనగా సమర్పిస్తారు. శ్రీశైలంలో అమ్మవారికి నివేదనగా సమర్పించే కదంబం ప్రసాదం ఎంతో విశేషమైనదిగా చెబుతారు.

శాంతమూర్తి మహాగౌరి



ఎనిమిదో స్వరూపం మహాగౌరి. ఈమె అత్యంత శాంతమూర్తి. ఈ దేవి చతుర్భుజాలను కలిగుంటారు. కుడివైపు పైచేతిలో త్రిశూలం, కింద అభయహస్తం, ఎడమవైపు పైచేయి వరదముద్ర, కింది చేతిలో డమరుకాన్ని కలిగుంటారు. మహాగౌరి తన పార్వతీరూపంలో పరమశివుని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేసింది. తపస్సు కారణంగా ఈమె నల్లబడింది. తపస్సుకు ప్రసన్నుడైన పరమశివుడు ఆమె శరీరంపై గంగాజలాన్ని చిలకరించారు. అప్పుడు ఆ దేవి తేజోవంతమైన గౌరవర్ణంలో అలరారింది. అందుకే ఈమెను మహాగౌరిగా పిలుబడుతున్నారు.

సిద్ధుల ప్రదాయిని సిద్ధిదాత్రి



నవదుర్గ స్వరూపాల్లో చివరిది సిద్ధిదాయిని. ఈ దేవి చతుర్భుజాలను కలిగుంటారు. కుడి వైపున చక్రం, గద, ఎడమ వైపున శంఖం, కమలాన్ని ధరించి ఉంటారు. మార్కండేయ పురాణం అణిమ, మహిమ మొదలైన ఎనిమిది సిద్ధులను పేర్కొంటుంది. బ్రహ్మవైవర్త పురాణంలోని శ్రీకృష్ణ జన్మ ఖండంలో ఈ సిద్ధులు పద్దెనిమిదిగా చెప్పబడ్డాయి. సిద్ధిదాయిని పూజించడం వల్ల ఈ సిద్ధులన్నింటినీ పొందవచ్చని దేవీభాగవతం చెబుతోంది.

మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకమని, ఖైదీలు సత్ప్రవర్తనతో మంచి జీవితం కొనసాగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి సూచించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కర్నూలు మండలం పంచలింగాలలోని జిల్లా కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి గాంధీ ప్రతిమకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి, దళాధిపతి మహేశ్‌కుమార్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కారాగార పర్యవేక్షణాధికారి నరసింహారెడ్డి, వైద్యాధికారి జగదీశ్, జైలర్ ఎరికినాయుడు, డిప్యూటీ జైలర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం



పారిశుద్ధ్య కార్మికులతో మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యేలు దస్తగిరి, గౌరు చరితారెడ్డి తదితరులు

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం అవసరమని మంత్రి టీజీ భరత్ అన్నారు. గార్గేయపురం సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ నిర్మాణానికి బుధవారం ఆయన కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్లాంటు నిర్మాణంతో ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేయడం, పొడి చెత్తతో ఎరువును తయారు చేయడం, ఇతర వ్యర్థాలతో భవన, రహదారుల నిర్మాణాలకు ఉపయోగించవచ్చన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ... డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి హాని కలగకుండా ఉండేందుకు ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. అనంతరం మొక్కలు నాటారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు, ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ రమేశ్‌బాబు పాల్గొన్నారు

4న ఉద్యోగ మేళా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఈ నెల 4న బీక్యాంపులోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి పి.దీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జస్ట్ డయల్, లోకల్ యాప్ కంపెనీల్లో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలీ కాలర్ పోస్టులకు ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణులైన 18-35 ఏళ్ల వయస్సు నిరుద్యోగ యువతీ, యువకులకు మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ. 20 వేలు, ఏడాదికి రూ. 2.76 లక్షలు వేతనం ఉంటుందన్నారు. అర్హులైనవారు మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి కోరారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం ఢణాపురం గ్రామ సమీపంలో చాకలి మల్లప్ప(23) అనే యువకుడు బుధవారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. హాళగుంద మండలం ముద్దటమాగి గ్రామానికి చెందిన చాకలి మల్లప్ప బేల్దారుగా పని చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నారు. రెండు నెలల కిందట భార్య ప్రసవం కావడంతో ఆమె పుట్టిల్లైన ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో ఉన్నారు. భార్యను చూసేందుకు వెళ్లిన మల్లప్ప ఢణాపురం సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బంధువులకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు నాగనాథనహళ్లి గ్రామంలో ఉన్న బంధువులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో ఉన్న మల్లప్పను గుర్తించి చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఇస్వీ పోలీసులు పేర్కొన్నారు.

ట్రాక్టర్ కింద పడి దుర్మరణం

దేవనకొండ, న్యూస్‌టుడే: రోజూలాగే కూలీ పనులకు వెళ్లిన పద్మావతి(40) అనే మహిళ విగతజీవిగా ఇంటికి వచ్చిన ఘటన దేవనకొండ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు గోనెగొండ్ల మండలం ఒంటెడుదిన్నె గ్రామానికి చెందిన పద్మావతి కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. దేవనకొండ మండలం దుప్పనగుర్తి పంట పొల్లాలో పనికి బుధవారం మరికొందరు కూలీలతో పాటు పద్మావతి వెళ్లారు. అక్కడ పొలం పనులు పూర్తి చేసుకొని కప్పట్రాళ్ల సమీపంలోని పొల్లాలకు పనులకు వెళ్లారు. ట్రాక్టర్‌పై నుంచి పద్మావతి దిగే సమయంలో డ్రైవర్ గమనించకపోవడంతో ఒక్కసారిగా ట్రాక్టర్ టైరు కింద పడి తీవ్ర గాయాలతో అకడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీంతో కూలీ పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు చనిపోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసీ కాలువలో మృతదేహం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని కేసీ కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం కనిపించింది. కర్నూలు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పోలీసులు జొహరాపురం వద్ద కాల్వ మధ్యలో మృతదేహాన్ని గుర్తించారు. బయటకు తీసేందుకు సన్నద్ధమవుతుండటంతో మృతదేహం గల్లంతైంది. చీకటి పడటంతో గుర్తించటం కష్టమైంది. మృతదేహం పైభాగం నుంచి ప్రవాహంలో కొట్టుకువచ్చినట్లు అనుమానిస్తున్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తపాలాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. ఆదోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో తపాలా శాఖ సేవలపై బుధవారం అవగాహన కల్పించారు. ఇటీవల న్యాయవాది యశశ్వి మృతి చెందారు. ఆయన భార్య సరస్వతికి రూ. 10,52,000 చెక్కును పోస్టల్ ఎస్పీ జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాలా జీవిత బీమాతో చాలా ప్రయోజనాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. తక్కువ ప్రీమియతో ఎక్కువ బోనస్ పొందే అవకాశం ఉందన్నారు. గతంలో జీవిత బీమా కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఉండేదని, ఇప్పుడు డిగ్రీ చదివిన ప్రతి ఒక్కరు అర్హులన్నారు. ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందన్నారు. చిన్నారులు, మహిళల కోసం ప్రత్యేక పథకాలు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు స్థానిక తపాలా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా ఏఎస్పీ శ్రీధర్, సహాయకులు రాజేష్, రాఘప్ప, ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందర్‌సింగ్, ఉపాధ్యక్షుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న తపాలా శాఖ జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి తదితరులు

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. డీఎస్ఏ మైదానంలోని జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా స్కేటింగ్ సంఘం ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్, కోశాధికారి అబుబాకర్, జిల్లా స్కేటింగ్ సంఘం కార్యవర్గ సభ్యుడు కాకని సత్యం, సంయుక్త కార్యదర్శి పునీత ఐదరితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చిన్నారులు అమితంగా ఇష్టపడే స్కేటింగ్ నేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు వస్తే, వారు సైతం నచ్చిన క్రీడల్లో ముందుకెళ్తారన్నారు. విజేతలైన క్రీడాకారులు నవంబరు 6 నుంచి 10వ తేదీ వరకు కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు అవినాశ్‌శెట్టి, స్కేటింగ్ పోటీల రాష్ట్ర పరిశీలకులు అంజనేయులు, రాజశేఖర్, పునీత్‌కుమార్ పాల్గొన్నారు.



స్కేటింగ్‌లో పోటీ పడుతున్న చిన్నారులు

పసిడి విజేతకు అభినందన

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే: సెప్టెంబరు 29న విశాఖలో జరిగిన మూడో రాష్ట్ర స్థాయి పారా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో కర్నూలు క్రీడాకారుడు ముస్తాక్ అహ్మద్ 10 మీటర్ల పిస్టల్ విభాగంలో 360 పాయింట్లు సాధించి పసిడి పతకం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తన ఛాంబరులో ఆయన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం కార్యదర్శి ఎంఎండీ బాషా, శిక్షకుడు రవికుమార్, బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు దాదాబాషా, వ్యాయామ ఉపాధ్యాయుడు ముస్తాహీర్ పాల్గొన్నారు.



క్రీడాకారుడిని సన్మానిస్తున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు

డీపీవోగా భాస్కర్

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా జి.భాస్కర్ గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు. డీపీవో స్థానంలో రామనాథరెడ్డి, భాస్కర్‌ను నియమిస్తూ గత నెల 22న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఎవరు విధులకు హాజరు కావాలనే సందిగ్ధ వాతావరణం నెలకొంది. తాజాగా ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చింది. ఈ మేరకు అనంతపురం జిల్లాకు బదిలీ అయిన నాగరాజునాయుడును ఇక్కడి రిలీవ్ చేయడంతోపాటు భాస్కర్‌ను విధుల్లో చేరాలని కలెక్టర్ రంజిత్ బాషా బుధవారం సాయంత్రం ఆదేశించారు. నాగరాజునాయుడుకు డీపీవో కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు వీడ్కోలు పలికారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, వామపక్షాలు, ప్రజాసంఘాలు, రైతు సంఘాల నాయకులు బుధవారం ధర్నాచౌక్ వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూసీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, చంద్రశేఖర్, వెంకటేశ్, రామాంజనేయులు, రేణుక, సుధాకర్, నరసింహులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న వామపక్షాల నాయకులు

రైతు శిక్షణకు శ్రీకారం

- గత ఐదేళ్లు నిర్వీర్యం చేసిన వైకాపా
- కూటమి ప్రభుత్వం నిధులివ్వడంతో మొదలైన సేవలు

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : పంటల సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు.. ఆధునిక విధానాలు.. తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరిస్తూ.. వ్యవసాయంలో అన్నదాతలు అధిక దిగుబడులు సాధించేలా సహకరించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కేంద్రానికి ఐదేళ్ల తర్వాత మోక్షం వచ్చింది. గత వైకాపా ప్రభుత్వం ఈ కేంద్రానికి పైసా నిధులు కేటాయించకపోవడంతో ఐదేళ్ల పాటు శిక్షణ కార్యక్రమాలు ఆగిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇటీవల ఈ కేంద్రానికి నిధులు కేటాయించడంతో మళ్లీ సేవలు మొదలయ్యాయి.



రైతులకు తర్ఫీదు ఇస్తున్న అధికారులు

◆ జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ), రైతు శిక్షణ కేంద్రంగా (ఎఫ్‌టీసీ) ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టేవారు. గత ఐదేళ్ల కాలంలో అవన్నీ నిలిచిపోయాయి. రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన (ఆర్‌కేవీవై), జాతీయ ఆహార భద్రత మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం), సీడ్ విలేజీ ప్రోగ్రాం (ఎస్‌వీపీ) తదితర పథకాల కింద నిధులు కేటాయించే వారు. గత వైకాపా ప్రభుత్వం వీటన్నింటికీ నిధులు ఇవ్వకపోవడంతో రైతులకు అవసరమైన కార్యక్రమాలన్నీ నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.

రూ.6.81 లక్షల విడుదల

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు శిక్షణ కేంద్రానికి రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన పథకం (ఆర్‌కేవీవై) కింద రూ. 6.81 లక్షల నిధులు విడుదల చేసింది. దీంతో ఈ కేంద్రం సేవలు పునఃప్రారంభమయ్యాయి. మిగతా పథకాలకు కూడా నిధులు వచ్చే అవకాశం ఉండటంతో ఇప్పటికే రైతులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు.

చేపట్టనున్న కార్యక్రమాలు

◆ రైతు శిక్షణ కేంద్రం ద్వారా మూడు రకాల కార్యక్రమాలు ఉన్నాయి.

రైతులకు.. : గ్రామాలకు వెళ్లి అక్కడ సాగుచేసే ప్రధాన పంటకు సంబంధించిన సాగు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించాలి. ఇలాంటి కార్యక్రమాలు ఏడాదిలో 40 వరకు చేపట్టాల్సి ఉంది.

వ్యవసాయ సిబ్బందికి..: కొత్తగా వచ్చే వ్యవసాయ పద్ధతులు, ఆధునిక విధానాలు, ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేయబోతున్న పథకాలపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఇలాంటి కార్యక్రమాలు నాలుగు నిర్వహించాల్సి ఉంటుంది.

పంటల పరిశీలన : జిల్లాలో సాగుచేసిన పంటలను ఆశించిన తెగుళ్లు, చీడపురుగులను గుర్తించాలి. సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు శాస్త్రవేత్తలతో కలిసి వెళ్లి పరిశీలించాలి. సమస్య పరిష్కారానికి తగిన సూచనలు, తెగుళ్ల నివారణ మార్గాలను సూచించాలి.

పలు అంశాలపై అవగాహన కల్పిస్తాం

- సరళమ్మ, జిల్లా వ్యవసాయ శిక్షణ అధికారిణి, నంద్యాల



రైతు శిక్షణ కేంద్రానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో దీని ద్వారా రైతులకు అందాల్సిన సేవలను ఇప్పటికే ప్రారంభించాం. గ్రామాల్లో పర్యటించి పంట సాగులో ఎదురయ్యే సమస్యలపై రైతులకు వివరిస్తున్నాం. యాజమాన్య పద్ధతులు, మందుల వాడకం, తెగుళ్ల నివారణపై శిక్షణ ఇస్తున్నాం.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరిచిపోలేనివి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి నెత్తిన నీళ్లు చల్లుకున్నారు. పురపాలక కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ ముగింపు కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌తో పాటు ఎమ్మెల్యే బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్మికుల సేవలు ఎనలేనివని, వారి రుణం తీర్చుకోలేనిదని పాదపూజ చేశారు.



కార్మికుల కాళ్లు కడుగుతున్న ఎమ్మెల్యే

4 నుంచి రాజమహేంద్రవరంలో రాష్ట్రస్థాయి పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు గురువారం ఉదయం 10:00 గంటలకు కర్నూలు రైల్వే స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలని సంఘం కార్యదర్శి సుబ్బరత్నాలు బుధవారం తెలిపారు. వివరాలకు 94933 23964, 89194 09232, 9866494372 చరవాణులను సంప్రదించాలన్నారు.

గాంధీ అడుగుజాడల్లో నడవాలి : ఎస్పీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: గాంధీ అడుగుజాడల్లో నడవాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహాదుర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు ఎస్పీ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు ప్రసాద్, గుణశేఖర్‌బాబు, శేషయ్య, ఆర్ఐ నారాయణ, సోమశేఖర్‌నాయక్, జావెద్ ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



గాంధీ, లాల్‌బహదుర్ శాస్త్రి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఖైదీలు సత్ప్రవర్తనతో జీవనం సాగించాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఖైదీలు సత్ప్రవర్తనతో జీవనం సాగించాలని ఆదోని జిల్లా రెండో అదనపు జడ్జి సుధ సూచించారు. ఆదోని ప్రత్యేక ఉప కారాగారంలో గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం బుధవారం నిర్వహించారు. జిల్లా రెండో అదనపు జడ్జి సుధ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. క్షణికి అవేశానికి లోనై తప్పులు చేయవద్దన్నారు. ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఆటల పోటీలో గెలుపొందిన ఖైదీలకు న్యాయమూర్తి బహుమతులు అందజేశారు. రెండో అదనపు జ్యూడిషీయల్ న్యాయమూర్తి శ్రీవల్లి, జైలర్ నజీర్ అహ్మద్, న్యాయవాది ఆనంద్ పాల్గొన్నారు.



ఖైదీలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా రెండో అదనపు జడ్జి సుధ

కార్మికుల రుణం తీర్చుకోలేనిది

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: సమాజ స్వచ్ఛతకు పాటుపడుతున్న పురపాలక పారిశుద్ధ్య కార్మికుల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే డా.పార్థసారథి అన్నారు. ఆదోని పురపాలక కార్యాలయంలో కమిషనర్ కృష్ణ అధ్యక్షతన స్వచ్ఛాతాహి సేవ ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉత్తమ సేవలను కనబరచిన 42 మంది కార్మికులకు పూలమాలలు, శాలువ, ధ్రువీకరణపత్రాలతో సన్మానించారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజారోగ్య వ్యవస్థను కార్మికులు మరింత బలోపేతం చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. రెండో పట్టణ సీఐ సూర్య మనోహర్‌రావు, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, కో-కన్వీనర్ నాగరాజుగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దాం

మండిగిరి(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: పంచాయతీల అభివృద్ధికి అందరం కలిసి కృషి చేద్దామని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మండలంలోని మండిగిరిలో స్వచ్ఛతా దివస్ గ్రామసభ బుధవారం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. పంచాయతీలకు వస్తున్న నిధులను ప్రణాళికబద్ధంగా ఖర్చు చేయాలన్నారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. డీఎల్‌పీవో నూర్జహాన్, భాజపా నాయకులు విట్టా రమేష్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు.

నూతన మద్యం పాలసీని సవరించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న నూతన మద్యం పాలసీని సవరించాలని ఏపీ మహిళా సమాఖ్య పత్తికొండ మండల అధ్యక్షురాలు చంద్రమ్మ డిమాండ్ చేశారు. పత్తికొండలో గాంధీ విగ్రహం వద్ద మహిళలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రాజాసాహెబ్, రామాంజనేయులు మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

చిప్పగిరి, న్యూస్‌టుడే: **సమస్య:** దౌల్తాపురం ప్రధాన రహదారులపై చెత్త చేరి అపరిశుభ్రంగా ఉంది.
- గోపాల్, దౌల్తాపురం

సమాధానం: పంచాయతీ సిబ్బందిని పంపించి రెండు రోజుల్లో వీధులన్నీ శుభ్రం చేయిస్తాం.
- లక్ష్మీదేవి, సర్పంచి, దౌల్తాపురం

టి.గోకులపాడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: **సమస్య:** టి.గోకులపాడు గ్రామంలో సచివాయలం వెళ్లే దారిలో కాల్వలు నీరు ముందుకు సాగడం లేదు.
-మహిధర్, గ్రామస్థుడు

సమాధానం: సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.
- రామాంజనేయులు, సర్పంచి

హొళగుంద, న్యూస్‌టుడే: **సమస్య:** స్థానిక తేరుబజారులో ప్రధాన రహదారిపై చెత్తా, ప్లాస్టిక్ వ్యర్థాలతో పరిసరాలంతా అపరిశుభ్రంగా ఉన్నాయి.
- రామ్‌నాథ్, హొళగుంద

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం.
-రాజశేఖర్‌గౌడ్, పంచాయితీ కార్యదర్శి, హొళగుంద

ఆలూరు, న్యూస్‌టుడే: **సమస్య:** ఆలూరు గాంధీనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో పిచ్చి మొక్కలు పెరిగి పరిసరాలు అధ్వానంగా మారాయి.
- రమేష్, ఆలూరు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పరిసరాలు శుభ్రం చేయిస్తాం. **- అరుణాదేవి, సర్పంచి, ఆలూరు**

ధ్వంసమవుతున్న రహదారులు.. పట్టించుకోని అధికారులు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో సీసీ రహదారుల నిర్వహణ మున్నాళ్ల ముచ్చటగా మారుతోంది. రూ.లక్షలు ఖర్చు చేసి రోడ్లు నిర్మిస్తున్నా నిర్వహణ లేక యథేచ్ఛగా ధ్వంసమవుతున్నాయి. నీటి గొట్టాల ఏర్పాటులో భాగంగా భూగర్భ తీగల నిర్మాణాల పేరుతో సీసీ రహదారులను డ్రిల్ చేసి పగలగొడుతున్నారు. ఒకవైపు రహదారులు లేక శివారు కాలనీలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు ఉన్న దారులను కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడింది. దారులతో పాటు ప్రధాన నీటి సరఫరా గొట్టాలు పగిలిపోతున్నాయి. డ్రిల్లింగ్ సమయంలో నీటి గొట్టాలను చూసుకోకుండా పనులు చేస్తున్నారు. ఇటీవల లంగరబావి వీధి, ఇందిరాగాంధీ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో ఇలా పనులు చేయడం వల్ల నీటి గొట్టాలు ధ్వంసమయ్యాయి. దీంతో నాలుగైదు రోజులు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాహన రాకపోకలకు తిప్పలు తప్పలేదు. వాటిని సరిచేయకుండా అలాగే వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంతపేటలో ఇలానే తవ్విన రహదారి గుంతలో చిన్నారి పడి గాయపడింది. కిలిచినపేటలో నీటి గొట్టాల కోసం దారిని తవ్వి ఐదేళ్లు దాటిని ఇంత వరకు ప్యాచ్ పనులు చేపట్ట లేదు. కౌడల్‌పేట, హవన్నపేట, పాత పట్టణంలోని చాలా వార్డుల్లో ఇదే పరిస్థితి ఉంది.



రహదారులను డ్రిల్లింగ్ చేస్తున్న ప్రైవేటు కార్మికులు

అనాలోచిత పనులతో ఇబ్బందులు

అభివృద్ధి పేరుతో అనాలోచిత పనుల వల్ల పట్టణవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. పనుల అనుమతి కోసం ఆయా ప్రైవేటు కంపెనీలు రూపాయి కడితే, అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా వంద రూపాయాలు ఖర్చు చేయాల్సి వస్తోంది. లంగరబావి వీధిలో ఇలానే భూగర్భ తంతి తీగల కోసం రూ.లక్షన్నర చలానా కడితే, ధ్వంసమైన నీటి గొట్టాన్ని కనుగొనేందుకు రెండు రోజుల పాటు పొక్లెయిన్‌తో రహదారిని పెకిలించి, వెతకాల్సి వచ్చింది. మరోవైపు మరమ్మతు పనుల పేరుతో మరో రోజు ఖర్చు చేశారు. ఇలా సమయంతో పాటు ఖర్చులు వృథా అవుతున్నాయి. అనుమతులు ఓ చోట తీసుకుని రెండు మూడు ప్రాంతాల్లో పనులు చేస్తున్నట్లు సాక్షాత్తు వార్డు కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. ఇంజినీరింగ్ అధికారులు, లైన్‌మెన్ దగ్గరుండి పర్యవేక్షించక పోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

పట్టణం:	ఆదోని
వార్డులు:	42
రహదారులు:	190 కి.మీ.
సీసీ రోడ్లు:	60శాతం
బీటీ రహదారి:	30శాతం
కచ్చా దార్లు:	10శాతం

పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తాం

- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

పట్టణంలో రహదారులు ధ్వంసం కాకుండా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేస్తాం. ఎక్కడ పనులు జరిగినా సంబంధిత సిబ్బంది పర్యవేక్షణలో జరిగేలా చేస్తాం. ధ్వంసమైన దారులను ప్రైవేటు కంపెనీలు కట్టిన డబ్బులతోనే మరమ్మతులు చేయిస్తాం.

కంబాలపాడులో కేఈ కృష్ణమూర్తి జన్మదిన వేడుకలు

కంబాలపాడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండలంలోని కంబాలపాడు గ్రామంలో రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కేఈ కృష్ణమూర్తి దంపతులు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కేఈ రుద్రగౌడ కలిసి తన తల్లిదండ్రులైన కేఈ మాదన్న, మద్దమ్మ, చిన్నన్న, కేఈ లక్ష్మన్న సమాధులకు నివాళులర్పించారు. అనంతరం డోన్, పత్తికొండ నియోజకవర్గాల నుంచి తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్ కోశారు. అనంతరం పూల మాలలతో ఆయన్ను సత్కరించారు. మండల నాయకులు నంది స్వాబు, కేశ శేషాద్రి, ఈశ్వరయ్య, తుగ్గలి నాగేంద్ర, నబి సాహెబ్, శ్రీరాములు, రమేష్, రవితేజ పాల్గొన్నారు.



మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న తెదేపా నాయకులు

మద్దికెరలో... మద్దికెర, న్యూస్‌టుడే: రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకొని తెదేపా నాయకులు కేక్ కోసి వేడుకలు బుధవారం జరుపుకొన్నారు. మద్దికెర, పెరవలి గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని షమీలా తెలిపారు. ఇటీవల కర్నూలులో జరిగిన పలు క్రీడల్లో 15 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రాముడు, ఉపాధ్యాయులు పవిత్ర ప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం

కృష్ణగిరి, న్యూస్‌టుడే: కృష్ణగిరి కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు కె.దివ్యకుమారి, ఆయిషా, గీత, రేవతి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు చైతన్య ప్రమోది బుధవారం తెలిపారు. గత నెలలో కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 7 వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని వివరించారు.

ఆకట్టుకున్న ముందస్తు దసరా వేడుకలు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర విద్యాసాయి విద్యా సంస్థల ఆధ్వర్యంలో ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులు నవ రాత్రుల సందర్భంగా అమ్మవారి అలంకరణలో బుధవారం ఆకట్టుకున్నారు. వేషధారణతో పాటు వారి నృత్యాలు ఆకట్టుకున్నాయి.



మహిషాసురమర్దిని వేషధారణలో విద్యార్థిని

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండలో కొలువైన కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఈర్లదిన్నె రమేశ్ బుధవారం తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. సంఘం సీనియర్ నాయకులు, వైద్యులు బి.సుబ్రహ్మణ్యం, ఆలయ ప్రధాన అర్చకులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలో కొలువైన సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అమావాస్య పురస్కరించుకుని బుధవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు, పంచామృతం, క్షీరాభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని లంగరబావి వీధి ఉరుకుంద ఈరన్నస్వామి, మట్కార్ వీధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో బుధవారం మహాలయ అమావాస్య పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. పల్లకి సేవ నిర్వహించి రెండు చోట్ల భక్తులకు అన్నదానాలు చేశారు. ఆలయ నిర్వాహకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దేవరగట్టు కొండపై కొలువైన మాళ మల్లేశ్వర స్వామికి అమావాస్య పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. జలాభిషేకం, తైలాభిషేకం, బండారు అర్చన, బిల్వ పుష్పార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, ఆకు పూజలు అమ్మవారికి కుంకుమార్చన, వస్త్రాలంకరణ మహా మంగళ హారతి నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజలందరి సహకారం అవసరమని ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారధి అన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను పట్టణంలోని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఒక ప్రణాళిక తయారు చేస్తోందన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.రంగన్న, రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవికుమార్, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాయుడు, నాయకులు రాజమౌళి, హనుమంతరెడ్డి, గోపినాయక్, సంగమేశ్, మల్లికార్జున పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే, ఏపీటీఎఫ్ నాయకులు

సమస్యలు పరిష్కరించాలని నిరసన

ఆదోని విద్య, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గాంధీ జయంతి పురస్కరించుకుని యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు బుధవారం నిరసన చేపట్టారు. ఆదోని నెహ్రూ పార్కులో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ పట్టణ గౌరవ అధ్యక్షుడు రాజేకుమార్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో తగినంత ఉపాధ్యాయులను నియమించాలని, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. జీపీఎఫ్ ఖాతాలను వెంటనే తెరిపించాలని, ఉపాధ్యాయ బదిలీలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్లికార్జున, గాదిలింగప్ప, రాజా, ఉసేన్, జీవిత, నాగేంద్ర, ఈరన్న, శ్రీనివాసులు, లింగన్న పాల్గొన్నారు.



నెహ్రూ పార్కులో నిరసన దీక్ష చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

టెట్ నిర్వహణ ఏర్పాట్ల పరిశీలన

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో నేటి(గురువారం) నుంచి ప్రారంభం కానున్న టెట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను ఆదోని డివిజన్ ఉప విద్యాధికారి వెంకటరామిరెడ్డి బుధవారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 123 కంప్యూటర్లు సిద్ధంగా ఉన్నాయని... నెట్‌వర్క్, టీం సభ్యులు అందుబాటులో ఉన్నారన్నారు. టెట్ పరీక్షలు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరీక్షలు రాసే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రెండు గంటలు ముందే చేరుకోవాలని సూచించారు. ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని, మొత్తం 3,100 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదోని డివిజన్ ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి

వ్యవసాయ ఆధారిత రంగాల అభివృద్ధికి చర్యలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకృతం కాకుండా జిల్లా వ్యాప్తంగా జరిగేలా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య కోరారు. పత్తికొండలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన పెరగాలంటే వ్యవసాయాధారిత రంగాలను అభివృద్ధి చేయాలన్నారు. వలసల నివారణకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకు కృషి చేయాలన్నారు. పత్తికొండ ప్రాంతంలోని హంద్రీనీవా సుజల స్రవంతి కింద పంట పొలాలకు సాగునీరు, చెరువులకు నీరు నింపే కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. నిలిచిపోయిన టమాటా ప్రాసెసింగ్ యూనిట్ పనులు ప్రారంభించాలన్నారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత రామచంద్రయ్య

గాంధీజీ ఆశయ సాధనకు కృషి

గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో వారి చిత్ర పటాలకు, విగ్రహాలకు నివాళి అర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.
-న్యూస్‌టుడే బృందం




దేవనకొండ: గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు



మద్దికెర: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీడీవో అనిత, ఎంపీపీ స్వర్ణలత, సర్పంచి సుహాసిని తదితరులు



ఆలూరు: హొళగుంద ఉన్నత పాఠశాలలో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



హాలహర్వి: సిద్ధాపురం గ్రామ సచివాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తూ...



చిప్పగిరి మండల కార్యాలయంలో ఎంపీడీవో కొండయ్య, జూటూరు హరధర్మ తదితరుల నివాళి



పత్తికొండ గ్రామీణం: గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తదితరులు



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న తెదేపా సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు తదితరులు



ఆదోని గ్రామీణం: నివాళి అర్పిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అధికారులు



ఆస్పరి: గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు



వెల్దుర్తి: నివాళి అర్పిస్తున్న ఆర్య వైశ్యులు నాయకులు

అవీ..ఇవీ ..అన్నీ

హొళగుంద, న్యూస్‌టుడే: గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించుకుని, అభివృద్ధి చేసుకోవాలని సర్పంచి రంగమ్మ, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. గ్రామ పంచాయితీ కార్యాలయంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు.

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో మాధవ్‌శంకర్ సూచించారు. మండలంలోని బంటనహాల్‌లో ఉపాధి పనులపై ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. సర్పంచి సుశీలమ్మ, క్షేత్ర సహాయకులు, మేటీలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పరిధిలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామని ఆదోని ఎక్సైజ్ సీఐ జాన్ సైదుల్ పేర్కొన్నారు. ఆదోని ఎక్సైజ్ సీఐగా ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్ ఎస్సైగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

రాతన(తుగ్గలి), న్యూస్‌టుడే: హంద్రీనీవా పథకం ద్వారా కృష్ణా జలాలు రాతన చెరువుకు రావడంతో తెదేపా రాష్ట్ర నాయకుడు మనోహర్‌చౌదరి రైతులతో కలిసి బుధవారం పూజలు చేశారు.

జొన్నగిరి(తుగ్గలి), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నీటి నిల్వ పనులు గుర్తించాలని జొన్నగిరి సర్పంచి ఓబులేష్ పేర్కొన్నారు. గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు.

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో భాజపా నాయకులు సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నీలకంఠ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందన్నారు.

విద్యార్థులు.. క్రీడల్లో మెరికలు

బాస్కెట్‌బాల్‌లో రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఆలూరు, న్యూస్‌టుడే: గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థులు వసతి గృహాల్లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ చదువుకుంటున్నారు. ఒకవైపు చదువుతో పాటు మరోవైపు క్రీడల్లో ప్రతిభ చూపుతున్నారు. ఆలూరు ప్రభుత్వ రెండో ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పలుమార్లు జిల్లా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్ని పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ఆలూరు ప్రభుత్వ రెండో ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బాస్కెట్‌బాల్ క్రీడపై ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సహకారంతో ఫిజికల్ డైరెక్టరు కవిరాజు శిక్షణలో ప్రతిభ కనబరుస్తున్నారు. పాఠశాల విరామ సమయంలోనే కాకుండా రోజు సాయంత్రం గంట పాటు బాస్కెట్‌బాల్‌లో సాధన చేస్తున్నారు. డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటూ రాణిస్తున్నారు. దీంతో మరి కొంతమంది విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు.



సాధన చేస్తున్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయికి ఎంపిక

పాఠశాలకు చెందిన నందు, సంతోష్, సాయిరాం, చిరంజీవి, తరుణ్‌తేజ పలుమార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. తాజాగా సెప్టెంబరులో కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి అక్టోబరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సాయిరాం, సంతోష్ 5 సార్లు జిల్లా, 2 సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటుతా - సంతోష్, ముత్తుకూరు

మాది ఆస్పరి మండలం ముత్తుకూరు. తల్లిదండ్రులు నరసింహులు, పద్మావతి వ్యవసాయం చేస్తూ నన్ను చదివిస్తున్నారు. ఆలూరులోని సమీకృత బాలుర వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుకుంటున్నాను. బాస్కెట్‌బాల్‌లో ఇప్పటికే రెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. మరో సారి ఎంపిక య్యాను. ఈసారి సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతాననే నమ్మకం ఉంది. జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతాను.



శిక్షణ ఎంతో ఉపయోగకరం - సాయిరాం, ఆలూరు

స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. తల్లిదండ్రులు మహాలింగ, సువర్ణ. తండ్రి కార్పెంటర్ పని చేస్తున్నారు. ఫిజికల్ డైరెక్టరు కవిరాజు శిక్షణలో బాస్కెట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నాను. ఇప్పటికే రెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. మరో సారి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే లక్ష్యం.



రహదారి ప్రమాదంలో వృద్ధుడి మృతి

తుగ్గలి, న్యూస్‌టుడే: గుత్తి-పత్తికొండ ప్రధాన రహదారిపై తుగ్గలి సమీపంలో జరిగిన రహదారి ప్రమాదంలో వృద్ధుడు మరణించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు బొల్లవానిపల్లి గ్రామానికి చెందిన సోమశేఖర్ రెడ్డి(73) పత్తికొండలో బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా లారీ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించి స్థానికులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించిగా బాధితుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వాహనం దగ్ధం

కృష్ణగిరి, న్యూస్‌టుడే: కృష్ణగిరి మండలం అమకతాడు టోల్‌ప్లాజా సమీపంలో 44 నంబర్ జాతీయ రహదారిపై బుధవారం విద్యుదాఘాతంతో వాహనం దగ్ధమైనట్లు డోన్ అగ్నిమాపక అధికారి రంగస్వామి గౌడు బుధవారం తెలిపారు. హైదరాబాదు నుంచి బెంగుళూరు వెళ్తున్న వాహనం ఇంటి సామగ్రి, రెండు ద్విచక్ర వాహనాలు తరలిస్తుండగా మంటలు వ్యాపించాయి. వెంటనే సిబ్బందితో వచ్చి మంటలు అదుపు చేసినట్లు ఆయన తెలిపారు. దాదాపు రూ.8 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. వాహన యజమాని సందీప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రంగస్వామిగౌడ్ పేర్కొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని భరత్‌నగర్‌లో కర్ణాటక మద్యం తరలిస్తుండగా మూడో పట్టణ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. సీఐ రామలింగమయ్య తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సిండే శ్రీనివాసులు, సత్యం ఆటోలో కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున కర్ణాటక మద్యం తీసుకొస్తుండగా బుధవారం పట్టుకున్నారన్నారు. వారి నుంచి 18 బాక్సులు(1728) కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం కుప్పగల్లు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కౌతాళం మండలం ఎరిగేరికి చెందిన వీరేశ్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వీరేశ్ ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు



లక్ష పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు

ఈరన్న స్వామికి లక్ష పుష్పార్చన

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : కర్నూలు జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్న స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం అమవాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష పుష్పాలను కర్నూలు నగరానికి చెందిన మురహరి వెంకటేశ్వర్లు శెట్టి దంపతులు దేవాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, డిప్యూటీ కమిషనరు విజయరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 4న ఉద్యోగమేళా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ, యువతి యువకులకు ఈ నెల 4న ఉద్యోగ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. బీటెక్, ఎంటెక్, బీఏ, ఇతర కోర్సులు చదివిన విద్యార్థులు హాజరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794 కోడుమూరు : 80085 73776

సి.బెళగల్ న్యూస్‌టుడే: **సమస్య:** రైతుసేవా కేంద్రం రహదారి బురదమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – గురుస్వామి ఇనగండ్లగ్రామం

సమాధానం : సమస్యను పరిష్కరిస్తాం. – ఈవోఆర్డీ సందీప్ సి.బెళగల్

సమస్య : నూతనంగా నిర్మించిన సచివాలయం భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలి. – వీరభద్రప్ప కొండాపురం

సమాధానం : సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. – ఈవోఆర్డీ సందీపు సి.బెళగల్

సమస్య : సి.బెళగల్ చెరువును తక్షణమే గాజులదిన్నె జలాశయం నీటితో నింపాలి. – మత్స్యకార్మిక సంఘం వెంకటేశ్

సమాధానం : డీఈఈ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. – ఎంపీడీవో రాముడు సి.బెళగల్

నందవరం, న్యూస్‌టుడే

సమస్య : నందవరం మండలంలోని బీరప్ప స్వామి దేవాలయం ఎదుట తాగునీటి పైపులైన్ లీకేజీ అవుతుంది. – గోవింద్, నందవరం గ్రామస్థుడు

సమాధానం : సమస్యను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. – సర్పంచి తోట సావిత్రి, నందవరం మండలం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే

సమస్య : మండలంలోని నాగులాపురం గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. – గవిగట్టు, నాగులాపురం.

సమాధానం : సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. – జనార్దన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో పెద్దకడబూరు

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత



బోడబండ గ్రామంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం బోడబండ గ్రామంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే అనారోగ్యాల బారి నుంచి కాపాడుకోవచ్చున్నారు. గ్రామాల అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. ఎంపీడీవో బంగారమ్మ, తెదేపా నాయకులు మల్లికార్జున, కేశన్న, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

అహింస మార్గం అందరికీ ఆదర్శం



గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

మంత్రాలయం, న్యూస్‌టుడే : అహింసే ఆయుధంగా భారతీయులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి దేశానికి స్వాతంత్య్రం సాధించిన మహానుభావుడు గాంధీజీ అని పార్లమెంటు తెదేపా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. బుధవారం ఆలూరు తెదేపా నాయకుడు వీరభద్రగౌడుతో కలిసి మంత్రాలయంలో రాఘవేంద్ర కూడలిలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

నిర్లక్ష్యం పేదలపాలిట శాపం



పంపన్నగౌడ్ కాలనీలో మట్టి దారి

పురపాలికలో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయాయి. ప్రభుత్వాలు టెండర్లు పూర్తి చేసి నిధులు విడుదల చేసిన గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో పేదప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. అన్ని శాఖలలో చేపట్టిన అభివృద్ధి పనులలో 1.4.2024నాటికి 25శాతం ఆపైన జరిగిన పనులకు మాత్రమే నిధులు విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఆలోపు జరిగిన పనులను రద్దు చేయాలంటూ జీవో నంబర్ 428-2024ను విడుదల చేసింది. గుత్తేదారులు నిర్లక్ష్యం, గత ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో అలసత్వం ప్రదర్శించడంతో పేదల కాలనీలలో అభివృద్ధి పనులన్నీ ఆగిపోనున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు పురపాలికలో నెలకొన్న సమస్యలు ఏళ్ల తరబడి చేపట్టిన పనుల తీరుపై ప్రత్యేక కథనం

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

రూ.3కోట్లతో 30కి పైగా పనులు

సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో దాదాపు రూ.3కోట్లతో 30కి పైగా పనులకు టెండర్లు పిలిచారు. వీటిలో కొన్ని పనులు చేపట్టడానికి గుత్తేదారులు అగ్రిమెంటు చేసుకున్నారు. కానీ వైకాపా నాయకులు చెప్పిన చోటనే పనులు ప్రారంభించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్న చాలా వీధులలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు లేక ఆయా కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

జీవో ప్రకారం పనులు చేపడతాం

– గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

ప్రభుత్వ ఆదేశానుసారం నడుచుకుంటాము. నత్తనడకన సాగుతున్న పనులను పరిశీలించి సంబంధిత గుత్తేదారుడితో మాట్లాడి మిగిలిపోయిన పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటాము.



నత్తతో పోటీపడుతూ..

ఈ చిత్రంలో కనిపిస్తున్నది పట్టణంలో తేరుబజార్ నుంచి టోపయ్య గుడికి వెళ్లే దారి. రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టడానికి టెండర్లు పిలిచి ఏడాది పూర్తయింది. కానీ పనులు చేపట్టకపోవడంతో ఇప్పుడు రద్దయ్యే అవకాశం ఉంది. ఈ రోడ్డు గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు నిండా గుంతలు ఏర్పడటంతో నిత్యం జనం అవస్థలు పడుతున్నారు.

గుత్తేదారుల అలసత్వంతో ప్రారంభం కాని పనులు

- పట్టణంలోని గీతానగర్ కాలనీలో రూ.20లక్షలతో చేపట్టిన పనులు దాదాపు పది శాతం మాత్రమే పూర్తి చేశారు. కేవలం కంకర వేసి వదిలేశారు.
- కొత్త ఇందిరానగర్ కాలనీలో ఏడాది క్రితం రూ.20 లక్షలతో డ్రైనేజీ పనులు చేపట్టాలని టెండర్లు పిలిచారు. గుత్తేదారులు అగ్రిమెంట్లు చేసుకున్న పనులు మాత్రం ప్రారంభించలేదు.
- సున్నంబట్టీ వీధిలో రెండు సీసీ రోడ్లు వేసేందుకు టెండర్లు పూర్తి చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభంకాలేదు.
- శివన్ననగర్ కాలనీలో డ్రైనేజీ, రహదారుల పనుల కోసం ఏడాది క్రితం రూ. 10లక్షల నిధులు విడుదల చేశారు. పనులు మాత్రం చేపట్టలేదు.
- మునెప్పనగర్ కాలనీలో రూ.15లక్షల నిధులతో సీసీ డ్రైనేజీ నిర్మాణం కోసం టెండర్లు పూర్తయ్యాయి. పనులను మాత్రం ప్రారంభించలేదు.
- అబ్బాస్ టాకీస్ ఏరియాలో డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టలేదు. టోపయ్య గుడి వద్ద రూ.15లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను అలాగే వదిలేశారు.
- అయ్యప్పస్వామి గుడి వెనుక పార్కు ఏరియాలో సీసీడ్రైనేజీ కోసం రూ.12లక్షలతో టెండర్లు ప్రక్రియ జరిగినా గుత్తేదారుడు నిర్లక్ష్యం కారణంగా పనులు మొదలు కాలేదు.
- రెండోవార్డులో రూ.10లక్షలతో నిర్మించాల్సిన సీసీ రోడ్డు పనులకు గ్రహణం పట్టింది. జోగి కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ కోసం రూ. 25లక్షలు, శివన్ననగర్‌లో సీసీ రోడ్డుకు రూ. 24లక్షలు, బుడగ జంగాల కాలనీలో రూ.24లక్షలతో చేపట్టాల్సిన పనులు నత్తనడకన సాగుతుండటంతో ఆ పనులన్నీ రద్దయ్యే అవకాశం ఉంది.



ఎంబీ చర్చి వద్ద చేపట్టని వైనం

గుంతల దారిలో అవస్థలు

ఈ చిత్రం కనిపిస్తున్నది పట్టణంలో ఎంబీ చర్చి నుంచి కలుగట్లకు రాకపోకలు సాగించే రహదారి. ఇక్కడ రోడ్డును వేసేందుకు రూ.40లక్షలు వెచ్చించి టెండర్లను పూర్తి చేశారు. నేటి వరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

నిత్యావసరాలు పంపిణీ



సీనియర్ ఏజెంట్‌ను సన్మానిస్తున్న మేనేజర్ తదితరులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఏజెంట్ల సంక్షేమానికి లియాఫీ పాత్ర కీలకమైనదని లియాఫీ బ్రాంచ్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ఏజెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏజెంట్ల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. వేధాస్ స్వచ్ఛంద సంస్థకు బియ్యం, కందిపప్పు, నూనె ప్యాకెట్లను పంపిణీ చేశారు. నాయకులు జయన్న, వీరేష్, పులినాయక్, సంతోష్‌కుమార్, తిమ్మారెడ్డి, పంపన్న, పాల్గొన్నారు.

సింగిల్‌స్టాప్ బస్సు ప్రారంభం



సింగిల్‌స్టాప్ బస్సు సర్వీసును ప్రారంభించిన డిపో మేనేజరు

గోనెగండ్ల, న్యూస్‌టుడే : ప్రయాణికులకు బస్సు కష్టాలు తీర్చేందుకు సింగిల్ స్టాప్ సర్వీసులను గోనెగండ్లలో స్టాపింగ్ పవర్ కల్పించినట్లు ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో మేనేజరు బి.అమర్‌నాథ్ తెలిపారు. గోనెగండ్ల ఆర్టీసీ బస్టాండును ఎమ్మిగనూరు డిపో మేనేజరు బుధవారం పరిశీలించారు. బస్టాండు పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలని ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. బస్టాండులో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు డిపో మేనేజరును కోరారు. డిపో మేనేజరు మాట్లాడుతూ సింగిల్ స్టాప్ బస్సులు బుధవారం నుంచే గోనెగండ్లలో నిలిపేలా అనుమతులు ఇచ్చామన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు ఏఎస్ఐ ఈశ్వర్, రంగస్వామి, కండక్టర్ ఉరుకుంద పాల్గొన్నారు.

ఏచూరి సేవలు మరువలేనివి



సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న గోస్‌దేశాయి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి మృతి సామాన్య ప్రజలకు తీరని లోటని, ఆయన పేదల హక్కుల కోసం నిత్యం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి అని సీపీఎం నాయకులు గోస్‌దేశాయి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో ఏచూరి సంస్మరణ సభను నిర్వహించారు. గోస్‌దేశాయి మాట్లాడుతూ భూ ఉద్యమాలు చేసి భూమిలేని పేదలకు భూ పంపిణీ చేసే విధంగా కృషి చేశారన్నారు. గ్రామాలలో పేదల పక్షాన నిలబడి అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని ఎదురించారన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెల గ్రూప్ సంస్థల అధ్యక్షులు మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సీపీఐ నాయకులు రంగన్న, సీపీఎం నాయకులు ఆదెన్న, సీపీఎం నాయకులు గోవిందు, హనుమంతు, సీఐటీయూ నాయకులు రాముడు, యూటీఎఫ్ నాయకురాలు నాగమణి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు దేవసాయం, యూటీఎఫ్ దావీదు, డీవైఎఫ్ఐ సురేష్, ఆజాద్, సీపీఎం పంపన్నగౌడ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



బాపూజీకి వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు నాగమణి డిమాండు చేశారు. బుధవారం గాంధీజీకి పూలమాల వేసి ఆయన విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ రాష్ట్రంలో జీవో నంబర్ 117తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పాత బకాయిలను తక్షణమే అందజేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను త్వరగా భర్తీ చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎల్లప్ప, రామాంజనేయులు, రాఘవేంద్ర, పంపాపతి, కొలన్న, దేవపాల్, నాగరాజు, రాజు, పాల్గొన్నారు.

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : వాలంటీర్ వ్యవస్థను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ పేర్కొన్నారు. బుధవారం వాలంటీర్లు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఎన్నికలలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సురేష్ కోరారు. రవి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర దక్కక రైతుల ఆవేదన

నందవరం, న్యూస్‌టుడే : ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పత్తి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నా బుధవారం గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. పంటలు మధ్యస్థ దశలో ఉన్న సమయంలో అధికంగా వర్షాలు కురవడంతో ఆశించిన దిగుబడులు రాలేదని రైతులు వాపోతున్నారు. సీజన్ మొదట్లో క్వింటాలుకు రూ. 9వేలు ధర పలికిన ప్రస్తుతం రూ.6200కు పడిపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురౌతున్నారు.

చెకుముకి పోటీలో చిన్నారుల ప్రతిభ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : పోటీ పరీక్షలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విజ్ఞాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణమూర్తి అన్నారు. పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి పోటీలో ప్రతిభ కనబరచడంతో బుధవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ మోహన్, చెకుముకి పోటీల నిర్వాహకుడు యూటీఎఫ్ నాయకులు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు



కోసిగి : గాంధీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సర్పంచి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి



పెద్దకడబూరు : చిన్నకడబూరులో గ్రామ పెద్దలు

బాపూజీ చూపిన బాటలో నడుద్దాం

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లోని మండల కేంద్రాల్లో, గ్రామాల్లోని గాంధీ విగ్రహాలకు కుల సంఘాలు, అధికారులు, తెదేపా నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రం సాధించిన గొప్ప వ్యక్తి బాపూజీ అని ఆయన సేవలను స్మరించుకున్నారు.



మంత్రాలయం : రాఘవేంద్రకూడలిలో ఆర్యవైశ్యులు







కౌతాళం : ఎంపీడీఓ, సిబ్బంది... కోడుమూరు గ్రామీణం : ఆర్యవైశ్య సంఘం... ఎమ్మిగనూరు : తెదేపా నాయకులు

స్వచ్ఛతాహి సేవతోనే పరిశుభ్రత సాధ్యం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీవో, సర్పంచి

గోనెగండ్ల, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంతో గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్రం వద్ద సర్పంచి హైమావతి ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదట గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంపీడీవో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈవోఆర్డీ నాగేష్, సతీష్, తెదేపా మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. అంతకు ముందు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు కాశీంవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ మాట్లాడుతూ దేశంలో భాజపా కులాలు మతాల మధ్య చిచ్చుపెడుతుందని గాంధేయ మార్గంలో పాలన సాగించడం లేదన్నారు. దేశంలో అన్ని మతాల ఐక్యంగా ఉండటం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కలందర్, ఖైజర్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో జిల్లా అధ్యక్షుడు దేవసాయం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు దేవసాయం

జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరాలు మారిన దళితులపై కులవివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గంజహళ్లి అడ్డురోడ్డు వద్ద కేవీపీఎస్ జెండాను ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, మైనార్టీ నాయకుడు దంగుఖాజ బుధవారం ఆవిష్కరించారు.

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే : కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కౌతాళం మండల కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు.

మురుగు రహదారిపై పరుగు



పెద్దకడబూరు మండల కేంద్రంలోని పీర్ల చావిడి ముందు ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న మురుగు కాల్వ పొంగింది. మురుగునీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి ఈ సమస్య వేధిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే పెద్దకడబూరు,

గ్రామ సింహాల బెడద.. బెంబేలెత్తుతున్న ప్రజలు



కోడుమూరులో గ్రామ సింహాలు గుంపులు గుంపులుగా తిరుగుతుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. తేరు బజారు, చిన్నబోయగేరి, మెయిన్ బజార్ తదితర వీధులలో గుంపులుగా తిరుగుతూ ప్రజలను వెంబడిస్తున్నాయి. కుక్కలు పలువురిని గాయపరుస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి కుక్కల సమస్యలను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే కోడుమూరు గ్రామీణం

రైతన్న చూపు.. పొగాకు సాగు వైపు

గూడూరు గ్రామీణం న్యూస్‌టుడే : ఏటా దిగుబడులు రాక నష్టపోతున్న అన్నదాతలు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. మిర్చి, పత్తి, ఉల్లి పంటలు వేసే కర్షకులు ఈ ఏడాది ఎక్కువగా పొగాకును సాగు చేస్తున్నారు. పొగాకుకి తక్కువ పెట్టుబడి అవుతుండటంతో పాటు, విపణిలో మంచి గిరాకి ఉండటంతో ఈ సాగు వైపు ఎక్కువగా రైతులు ఆసక్తి చూపుతున్నారు.

గతేడాది కన్నా ఎక్కువగానే సాగు

నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో ఏటా అరకొరగా పొగాకు సాగవుతోంది. కానీ ఈ ఏడాది మాత్రం 3500 ఎకరాల విస్తీర్ణంలో సాగైంది. గతేడాది కిలో పొగాకు రూ. 140 నుంచి 160 వరకు ధర పలకడంతో సాగు చేసిన రైతులు లాభాలు పొందారు.

సాగు వివరాలు ఇలా

మండలం	గతేడాదిలో	ఈ ఏడాదిలో (ఎకరాల్లో)
కోడుమూరు	340	1100
గూడూరు	460	1870
సి.బెళగల్	200	530



రైతులు సాగు చేసిన పొగాకు

ఈ సారి కూడా ధరలు ఆశాజనకంగా ఉంటాయనే ఆశా భావంతో పొగాకును సాగు చేశారు. ఈ ఏడాది గూడూరు, రేమట, పోలకల్లు, చనుగొండ్ల, ఆర్.కానాపురం, పెంచికలపాడు, పర్ల, నాగలాపురం, ముడుమాల,, కొండాపురం, గుండ్రేవుల, గుడిపాడు, బుడిదపాడు, వర్కూరు గ్రామాల్లో అత్యధికంగా పొగాకును సాగు చేశారు.

మిర్చిపై నమ్మకం సన్నగిల్లి

రూ. లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన మిరప పంట నల్లితాకిడికి వైరస్ సోకి దిగుబడులు తగ్గాయి. పత్తిపంట ఎర్రపురుగుతో దెబ్బతిని పాడవుతోంది. దీంతో రైతులు పొగాకు వైపు మొగ్గుచూపుతున్నారు. అక్టోబరు వరకు పొగాకు సాగుకు అనుకూలం కావడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, ఉల్లి, వేరుశనగ, కొర్ర పంటలను తొలగించి పొగాకును నాటుతున్నారు. ఎకరానికి కనీసం 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సరాసరి క్వింటా రూ. 15వేలు పలికిన ఎకరానికి లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది.

సంక్షిప్త సమాచారం

సి.బెళగల్ న్యూస్‌టుడే : మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, సర్పంచీల అధ్యక్షతన, ఎంపీడీవో రాముడు సమక్షంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభల్లో ఉపాధి హామీ, గ్రామాభివృద్ధి పనులను గుర్తించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గూడూరు గ్రామీణం న్యూస్‌టుడే : కె. నాగలాపురంలో సుంకులమ్మ ఆలయంలో గురువారం నుంచి నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసయ్య తెలిపారు. 12వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే : దేవి నవరాత్రి ఉత్సవాలను మంత్రాలయంలోని వాసవి కన్యకపరమేశ్వరి కళ్యాణ మంటపంలో నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం పెద్దలు తెలిపారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే : సి.బెళగల్‌లో గురువారం దేవీ నవరాత్రులు ప్రారంభమవుతుండటంతో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సర్విశెట్టి, రామలింగయ్య శెట్టి, కార్యదర్శి రవికుమార్‌శెట్టి వాసవీ మాతా ఆలయాన్ని ముస్తాబు చేశారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : కల్లుకుంటకు చెందిన గోవిందమ్మ తనకు న్యాయం కావాలంటూ బుధవారం డీఎస్పీ ఉపేంద్రబాబుకు వినతి పత్రం అందించి, సోమప్ప కూడలిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. గ్రామస్థులు కరెంటు స్తంభానికి కట్టేసి కొట్టి తనను వేధించారని న్యాయం చేయాలంటూ ఆమె కోరారు.

సి.బెళగల్, : మండల కేంద్రమైన బుధవారం బసవకల్యాణ్ స్వామి ఆలయంలో వీరశైవులు ఆధ్వర్యంలో అమావాస్య పూజలు నిర్వహించారు.

ఎమ్మిగనూరు : పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా చేసుకోని చేపట్టిన కార్యక్రమాలతోనే సమాజాభివృద్ధి సాధ్యమని రావూస్ డిగ్రీ కళాశాల సీఈఓ తిరుమల్‌రెడ్డి అన్నారు.

గోనెగండ్ల : గంజహళ్లిలో తెదేపా కార్యకర్త సోగనూరు దర్గయ్య (55) గుండెనొప్పితో బాధపడుతూ బుధవారం మృతి చెందినట్లు తెదేపా నాయకులు వెంకటేశ్వర్లు, కృష్ణమనాయుడు,మాజీసర్పంచి శ్రీను, తెలిపారు.

గూడూరు గ్రామీణం : సి. బెళగల్ మండల పరిధిలోని పోలకల్లుకు చెందిన మల్లెపోగు సుమన్ (36) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. డీఎస్సీ పరీక్షల కోసం కడప జిల్లా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : సుంకేశుల జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. బుధవారం నాటికి 6,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు జలాశయ ఇంజనీరు రాజు తెలిపారు.

కర్నూలు

•కర్నూలు • పాణ్యం

ఫోరెన్సిక్ పీజీ విద్యార్థులకు బహుమతులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: కాకినాడలో జరిగిన దక్షిణ భారత న్యాయవైద్య సదస్సులో 'మరణం తర్వాత భద్రపరిచి.. తిరిగి బతికించడంపై' ఉపన్యాసం ఇచ్చిన కర్నూలు వైద్య కళాశాల ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ సాయిసుధీర్‌ను, పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్‌లో పీజీ విద్యార్థులు ద్వితీయ తృతీయ బహుమతులు సాధించారు. పీజీ విద్యార్థులు మహమ్మద్‌అలీ, కార్తీక్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ బుధవారం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ప్రమాదకరంగా పైపులైన్ గుంతలు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: కేతవరం నుంచి గార్గేపురం వెళ్లే ప్రధాన రహదారిలో పైపులైన్ కోసం తీసిన గుంతలు ప్రమాదకరంగా మారాయని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఓర్వకల్లు పరిశ్రమల నీటి అవసరాలకు తవ్విన పైపులైన్ గుంతలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట నాయకులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, రంగస్వామి, బుగ్గరాముడు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణ : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగర పాలక సంస్థ: **సమస్య:** నంద్యాల చెక్‌పోస్టు కూడలి సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలు సాగే క్రమంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. - **జీవన్**

సమస్య: బలిజ కూడలి దిద్దుబాటుపారల సముదాయం వద్ద విద్యుద్దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రివేళల్లో ఇబ్బందులు తప్పడం లేదు. - **స్థానికులు**

సమాధానం: సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. - **నగర పాలక అధికారులు**


కర్నూలు జడ్పీ: పసుపల గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులతో జడ్పీ సీఈవో నాసరరెడ్డి

పంచాయతీల్లో స్వచ్ఛత దివస్

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: సెప్టెంబరు 17న ప్రారంభించిన స్వచ్ఛతాహి సేవ గాంధీ జయంతి సందర్భంగా ముగిసింది. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి కర్నూలు గ్రామీణ మండలం పసుపల, పంచలింగాల గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛత దివస్‌లో పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జడ్పీ కార్యాలయ ఆవరణలో సీఈవో నాసరరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు గాంధీకి నివాళి అర్పించారు. జడ్పీ ఆవరణలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సర్కిల్ కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి నివాళి అర్పించారు. ఈఈలు రామకృష్ణారెడ్డి, డీఈఈలు రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు, శేషయ్య, మురళీ, మధుసూదన్, ప్రకాశ్ పాల్గొన్నారు.

భయపెడుతున్న భైరవులు

■ నగరంలో 11 వేలకుపైగా కుక్కల సంచారం
■ అదుపు చేయడంలో నగర పాలక సంస్థ విఫలం

☛ ఇటీవల పాత నగరంలో ఓ పిచ్చి కుక్క దాడి చేయడంతో సుమారు 40 మంది గాయపడ్డారు. ఇందులో చిన్న పిల్లలు ఎక్కువగా ఉన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. దాడిలో గాయపడిన వారికి నగర పాలక తరఫున ఒక్కొక్కరికి రూ.10 వేలు నష్ట పరిహారం ప్రకటించారు.

☛ శరీన్‌నగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తులను వీధిలో కుక్కలు వెనుక వైపు నుంచి వచ్చి దాడి చేసి గాయపర్చాయి. దీంతో స్థానికులు ఆసుపత్రి పాలయ్యారు.

☛ వైకాపా హయాంలో కర్నూలు నగర పాలక పాలకవర్గ సమావేశంలో నగరంలో కుక్కల బెడద అధికంగా ఉంది. నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని కార్పొరేటర్లు కోరినా పట్టించుకోలేదు.

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే:



కర్నూలు నగరంలో సుమారు 11 వేలకుపైగా కుక్కలు ఉన్నట్లు నగర పాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. నగరంలో సుమారు వెయ్యి కాలనీలు ఉన్నాయి. ఒక్కో కాలనీలో 40 శునకాల లెక్కన చూసినా.. 40 వేల వరకు ఉంటాయని అంచనా. వీటి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రహదారులపై వెళ్లేవారిపై ఇష్టానుసారంగా దాడి చేస్తున్నాయి. వాహనాలపై వెళ్లేవారిని వెంటాడుతుండటంతో వారు వేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిలిచిన కు.ని. శస్త్రచికిత్సలు

కర్నూలు నగరంలో మొదటి విడతలో 6,050 కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేశారు. రెండో విడతలో 5,500 వరకు చేయాల్సి ఉండగా సుమారు 2 వేల వరకు నిర్వహించారు. నవోదయ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని కుక్కలను వాహనాల్లో తరలించి గార్గేయపురం డంపింగ్ యార్డు సమీపంలో వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రానికి తరలించి అక్కడ కు.ని. శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇందుకుగానూ నగర పాలక సంస్థ ఒక్కో శస్త్రచికిత్సకు రూ.1500 వరకు చెల్లిస్తుంది. కుక్కను పట్టుకుని వాహనాల్లో తరలించినప్పటి నుంచి వాటికి టీకాలు వేయడం, ఆహారం ఇవ్వడం, శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. ప్రతిరోజూ 20 కుక్కల వరకు శస్త్రచికిత్సలు చేశారు. అయితే ఆగస్టు 8వ తేదీ నుంచి శస్త్రచికిత్సలను నిలిపివేశారు. సొసైటీవారు యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియాకు సరైన ధ్రువీకరణ పత్రం సమర్పించకపోవడంతో ఆగిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.


ఇటీవల పాత నగరంలో పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారులు

మేల్కోని అధికారులు

ఆగస్టు 8 నుంచి కు.ని. శస్త్రచికిత్సలు ఆగిపోయినా నగర పాలక అధికారులు మేల్కోలేదు. కుక్కల నియంత్రణకు తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలను అన్వేషించలేదు. ఇటీవల మంత్రి టీజీ భరత్ నగర పాలక శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే రోజు పాత నగరంలో పిచ్చికుక్క దాడిలో 40 మంది వరకు గాయపడ్డారు. పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి, కలెక్టర్, నగర పాలక కమిషనర్ పరామర్శించారు. నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు కు.ని. శస్త్రచికిత్సలకు అనుమతులు కోరుతూ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు.

పెరుగుతున్న బాధితులు

కర్నూలు నగరంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా కనిపిస్తుంటాయి. వృద్ధులు, చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయి. ప్రతి నెలా 100 మందికి పైగా కుక్క కాటుకు గురవుతున్నారు. ఏటా సుమారు 1,500 మంది వరకు బాధితులు ఉంటున్నారు. ఆసుపత్రులకు రాని కేసులు మరిన్ని ఉన్నాయి. అయినా నగర పాలక సంస్థ అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం. ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా, కార్పొరేటర్లు నగర పాలక సర్వసభ్య సమావేశంలో సమస్యను లేవనెత్తినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మరోవైపు కుక్క కాటుకు గురైన బాధితుల సంఖ్య తగ్గడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


మట్టి విగ్రహాల కూపన్లు అందజేసిన మంత్రి టీజీ భరత్

టీజీవీ గ్రూప్స్ తరఫున దుర్గామాత మట్టి విగ్రహాల పంపిణీ

కర్నూలు బి.క్యాంపు, కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: దుర్గామాత ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి టీజీవీ సంస్థ తరఫున దుర్గామాత మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈసారి రూ.5 లక్షలు పెట్టి 47 మట్టి విగ్రహాలను తయారు చేయించి అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. విగ్రహాలకు సంబంధించిన కూపన్లను ఆయన తన కార్యాలయంలో బుధవారం నిర్వాహకులకు అందించారు. రాబోయే ఐదేళ్లలో కర్నూలులో మట్టి విగ్రహాలే ప్రతిష్ఠించేలా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని తెలిపారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు


విద్యుద్దీపాల వెలుగులో కేసీ కాల్వ వద్దనున్న అయ్యప్ప దేవాలయం

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ఈ నెల 3 నుంచి 12 వరకు కర్నూలులోని ప్రధాన ఆలయాల్లో, అమ్మవారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 3న గురువారం ఉదయం ఆలయాల్లో అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆలయాలను విద్యుద్దీపాలు, వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. 9 రోజుల పాటు ఉత్సవాలకు వచ్చే భక్తులకు వసతులు కల్పించేందుకు నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. మహిళలు ప్రతిరోజూ కుంకుమార్చనలు, లలితా సహస్ర నామావళి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండు చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి సారి కర్నూలు జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా ప్రజలను నిరాశపరిచారన్నారు. సూపర్ సిక్స్ హామీలతోపాటు వెనుకబడిన జిల్లా అభివృద్ధికి, ప్రాజెక్టులు, పరిశ్రమలకు నిధులు కేటాయిస్తారని ఎదురుచూశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, మహేశ్, శ్రీనివాసులు, శ్రీరాములుగౌడ్, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

సుందరీకరణ ఏది?



కర్నూలు నగరంలోని ధర్మపేట కూడలి సమీపంలో విభాగినిపై గ్రానైట్ బండలు లేకపోవడంతో అధ్వానంగా మారింది. కూడలి సైతం దారుణంగా తయారైంది. కట్టడాలు కూలిపోతున్నాయి. గత కొన్ని రోజులుగా ఇలానే ఉన్నా నగర పాలక శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణం


కర్నూలు వెంకటరమణకాలనీ: విద్యుత్తు భవన్‌లో ఎస్ఈ ఎం. ఉమాపతి, ఎస్ఏవో చిన్నరాఘవులు, డీఈటీ ఓబులేసు


కర్నూలు వైద్యాలయం: గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, డీపీఎంవో డాక్టర్ ఉమా, డీఐవో నాగప్రసాద్


కర్నూలు బి.క్యాంపు: ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, శేఖర్, దేవదాసు, గోవింద్

అహింసావాది.. ఆదర్శమూర్తి

కర్నూలు నగరంతోపాటు గ్రామీణ మండలం, ఓర్వకల్లు, పాణ్యం మండలాల్లో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది గాంధీ సేవలను కొనియాడారు.
– కర్నూలు బృందం, న్యూస్‌టుడే


కర్నూలు సచివాలయం: హౌసింగ్ కార్యాలయంలో హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి


కర్నూలు బి.క్యాంపు: గాంధీ విగ్రహం వద్ద భాజపా నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి డా.కొట్టే చెన్నయ్య, జీఎస్ నాగరాజు, రాంమద్దిలేటి


కర్నూలు సచివాలయం: గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జిల్లా కురువ సంఘం జిల్లా నాయకులు ఎంకే రంగస్వామి, గడ్డం రామకృష్ణ, కేసీ నాగన్న

మద్యంతో పేదల ఆదాయానికి గండి


ధర్నాలో ఏపీ సమాఖ్య, ఏఐవైఎఫ్ఎఫ్ నాయకులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆదాయం కోసం పేదల ఆదాయాన్ని ప్రభుత్వం గండి కొట్టనుందని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం విధానంపై నిరసనగా ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌లోని గాంధీ విగ్రహం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. నాయకులు షాబీర్ బాషా, మహేశ్, శ్రీనివాసరావు నాగరాజు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ఆర్‌యూ జట్టు


ఉప కులపతితో విజేత జట్టు సభ్యులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: రెండు రోజులుగా ఆర్‌యూ విశ్వవిద్యాలయ మైదానంలో జరుగుతున్న అంతర్ కళాశాలల బాలుర కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఆర్‌యూ జట్టు, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలపై 35-30 తేడాతో విజయం సాధించి ట్రోఫీ సొంతం చేసుకుంది. శ్రీలక్ష్మి బీపీడీ కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ఆర్‌యూ ఉప కుపలతి ఆచార్య ఎన్‌టీకే నాయక్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల వ్యాయామ అధ్యాపకులు వెంకటేశ్వర్లు, పోటీల నిర్వాహణ కార్యదర్శి, ఆర్‌యూ క్రీడల సమన్వయకర్త శివకిశోర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-19 రగ్బీ పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: విజయం సాధించాలంటే క్రీడా స్ఫూర్తి అవసరమని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. నగర శివారులోని ఆదర్శ విద్యా మందిరంలో బుధవారం 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 రగ్బీ పోటీలను నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు, వృత్తి విద్యాధికారి పరేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి, ఆదర్శ విద్యా సంస్థల అధినేత తిమ్మయ్యతో కలిసి ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ. . 12 జట్లు పోటీ పడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సంఘం నాయకుడు సురేందర్ పాల్గొన్నారు.


కవాతు చేస్తున్న క్రీడాకారులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


ర్యాలీలో ఎన్‌సీసీ విద్యార్థినులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: గాంధీ జయంతి పురస్కరించుకొని 9 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థినులు బుధవారం కలెక్టరేట్ వద్ద గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని కోరుతూ చాణిక్యపురి కాలనీలో ర్యాలీ నిర్వహించారు. సమీపంలోని పార్కులో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారిణి యామిని, భతూర్‌బాబా, మాంటిస్సోరీ విద్యా సంస్థల ఉపాధ్యాయ బృందం, పరిపాలనాధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

6న జిల్లా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని డీఎస్ఏ మైదానంలో ఈ నెల 6న ఉదయం 9.00 గంటలకు జిల్లా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కర్నూలు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 98662 11480, 94413 33280 చరవాణులకు సంప్రదించాలని కోరారు.

క్లస్టర్-7 సీబీఎస్ఈ ఫుట్‌బాల్ పోటీలు ముగింపు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలు నగర శివారులోని రిడ్జి ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 అండర్-14, 17, 19 బాలుర ఫుట్‌బాల్ పోటీలు బుధవారంతో ముగిశాయి. తుది పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. అండర్-19 తుది పోరులో హైదరాబాద్ మెలుహ పాఠశాల జట్టు, సికింద్రాబాద్ ఆర్మీ పబ్లిక్స్ పాఠశాలపై 5-3 గోల్స్ తేడాతో గెలిచింది. మూడో స్థానంలో నాచారం దిల్లీ పబ్లిక్ పాఠశాల జట్టు నిలిచింది. అండర్-17 బాలుర విభాగంలో వైజాగ్ నేవీ చిల్డ్రన్ పాఠశాల జట్టు, హైదరాబాద్ చిరక్ ఉన్నత పాఠశాలపై 1-0తో గెలిచి ట్రోఫీ సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లోని బాచుపల్లి సిల్వర్ ఓక్స్ పాఠశాల జట్టు మూడో స్థానం సాధించింది. అండర్-14 విభాగంలో హైదరాబాద్ రాక్‌విల్ పాఠశాల జట్టు, విజయవాడ దిల్లీ పబ్లిక్ పాఠశాలపై 2-1 గోల్స్ తేడాతో విజయం నమోదు చేసుకుంది. మూడో స్థానంలో హైదరాబాద్ గండిపేట బిర్లా ఓపెన్ మైండ్ పాఠశాల నిలిచింది. గెలుపొందిన వారికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా, విద్యా సంస్థల వ్యవస్థాపకుడు పుల్లయ్య, రిడ్జి పాఠశాల సీఈవో జి.గోపినాథ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త సౌమ్య గోపినాథ్, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్‌కమల్, పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ మోహన్ కుమార్ పాల్గొన్నారు.

ఈరన్న స్వామికి లక్ష పుష్పార్చన

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : కర్నూలు జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్న స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం అమవాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష పుష్పాలను కర్నూలు నగరానికి చెందిన మురహరి వెంకటేశ్వర్లు శెట్టి దంపతులు దేవాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, డిప్యూటీ కమిషనరు విజయరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి నాణ్యతనుబట్టి ధర కోట్ చేయాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు మార్కెట్‌లో ఉల్లిగడ్డల నాణ్యతను బట్టి ధరను ఈ.నామ్‌లో కోట్ చేయాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి జయలక్ష్మి ఉల్లి వ్యాపారులకు సూచించారు. బుధవారం ఆమె కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఉల్లి వ్యాపారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. లైసెన్సు పొందిన వ్యాపారులే ఈ.నామ్ బిడ్డింగ్‌లో పాల్గొనాలన్నారు. లేనివారు పాల్గొంటే చర్యలు తప్పవన్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులను గ్రేడింగ్, క్లీనింగ్ (శుభ్రం) చేసుకొని మార్కెట్‌కు తీసుకువస్తే మంచి ధర లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రహిమాన్ పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి రోజున నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురిని మద్య నిషేధ, ఆబ్కారీశాఖ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. కర్నూలులోని మాధవినగర్‌కు చెందిన ప్రతాప్ శెట్టిని మునగాలపాడు వద్ద, కర్నూలు మండలం ఉల్చాలకు చెందిన శంకరమ్మను, కర్నూలు పరిధిలో బుక్కన్నను అరెస్టు చేసి 75 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు. ఈఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐ రాజేంద్రప్రసాద్, కర్నూలు స్టేషన్ సీఐ చంద్రహాస, ఎస్సైలు మధుసూదన్, రెహానాబేగం ఉన్నారు.

విమానాశ్రయ ఉద్యోగి మృతి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: కర్నూలు విమానాశ్రయంలో పని చేస్తున్న హరిచంద్ర (25) గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు బుధవారం తెలిపారు. ఏడేళ్లుగా ఏపీఏడీసీఎల్ గ్రౌండ్ స్టాఫ్‌గా పని చేస్తున్నారని, ఆయనకు రావాల్సిన జీతభత్యాలు, ఆర్థిక సహాయాన్ని అందించాలని బంధువులు విమానాశ్రయం ఎండీని కోరారు.

సాధనతో ఆట.. విజయాల బాట

☛ క్రీడల్లో రాణిస్తున్న యువత

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 క్రీడా పోటీల్లో కర్నూలు మండల క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుని పర్యవేక్షణలో నిరంతరం సాధన చేస్తూ విజయాలు సొంతం చేసుకుంటున్నారు. **కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే:**

మహేశ్.. బాస్కెట్‌బాల్‌లో భేష్



నేను ఎనిమిదో తరగతి చదువుతున్నా. మా అమ్మానాన్నలు రామేశ్వరమ్మ, నాగేశ్ వ్యవసాయం చేస్తారు. కర్నూలు మండలం ఎస్‌జీఎఫ్ అండర్-14 క్రీడా పోటీల్లో బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ కనబరుస్తా. 2023లో పల్నాడులో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానం సాధించాను. 2024 సెప్టెంబరు 26న కర్నూలు డీఎస్‌ఏ మైదానంలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించి జట్టులో కీలక పాత్ర పోషించాను. వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్ ప్రోత్సాహంతో ఆటలో ప్రావీణ్యం సాధించాను. జిల్లా జట్టుకు ఎంపిక కావడంతో నిత్యం మరింత సాధన చేస్తున్నాను.

శివవాణి.. పరుగులో లేడి



నేను కొంతపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. మా అమ్మానాన్నలు సుజాత, పెద్ద హుస్సేన్ కూలీ పనులు చేస్తుంటారు. నేను కర్నూలు మండలం ఎస్‌జీఎఫ్ అండర్-14 క్రీడా పోటీల్లో బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటాను. 2023లో మదనపల్లిలో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాను. 2024 సెప్టెంబరు 26న కర్నూలు డీఎస్‌ఏ మైదానంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో 100, 200 మీటర్ల పరుగులో బంగారు పతకం సాధించాను. హైజంప్‌లో 120 మీటర్లు దూకి జిల్లా పోటీలకు ఎంపికయ్యా. బాస్కెట్‌బాల్ పోటీలకు సైతం ఎంపిక కావడంతో రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించేందుకు సాధన చేస్తున్నాను.

అథ్లెటిక్స్‌లో కాంస్యం



నేను తొమ్మిదో తరగతి చదువుతున్నా. కర్నూలు మండలం ఎస్‌జీఎఫ్ అండర్-14 క్రీడా పోటీల్లో బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటాను. మా అమ్మానాన్నలు గోవిందమ్మ, టి.మద్దిలేటి వ్యవసాయం చేస్తారు. 2023 సెప్టెంబరులో కర్నూలు డీఎస్‌ఏ మైదానంలో జరిగిన ఖోఖో పోటీల్లో పాఠశాల జట్టును ప్రథమ స్థానంలో నిలిపాను. 2024 సెప్టెంబరు 26న కర్నూలు డీఎస్‌ఏ మైదానంలో నిర్వహించిన 100 మీటర్ల పరుగుపందెం పోటీలో కాంస్య పతకం సాధించాను. ఖోఖో పోటీల్లో రాణించి జిల్లాకు జిల్లా జట్టుకు ఎంపిక కావడంతో ఈ క్రీడపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టి సాధన చేస్తున్నాను.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: రైతులకు 50 శాతం రాయితీతో శనగ విత్తనాలు పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు.

☛ డా.బి.ఆర్.అంబేడ్కర్ ఆశించిన కుల నిర్మూలన లక్ష్య సాధన దిశగా చైతన్యంతో ఉద్యమించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు అన్నారు. బుధవారం కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలో పలుచోట్ల సంఘం జెండాలు ఆవిష్కరించినట్లు తెలిపారు.

☛ ప్రజా కళాకారుడు, గాయకుడు, రచయిత వాసు వర్ధంతి సందర్భంగా బుధవారం సుందరయ్య భవన్‌లో ఐద్వా, డీవైఎఫ్ఐ, పీఎన్ఎం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం అమిలియో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

☛ జిల్లా వ్యాప్తంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ ఆధారిత పరీక్షలు నిర్వహించినట్లు సంస్థ జిల్లా కార్యదర్శి ఖాజాహుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.